# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - ఆదివారం 27 ఏప్రిల్ 2025 ‖ సంపుటి:9 ‖ సంచిక:121 ‖ పేజీలు:8+4 ‖ వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA| HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM |




## పోప్ ఫ్రాన్సిస్‌కు అంతిమ వీడ్కోలు

సెయింట్ మేరీ మేజర్ బసిలికాలో ఖననం

రాష్ట్రపతి ముర్ముతో సహా అంత్యక్రియలకు హాజరైన ట్రంప్, మెక్రాన్, కీర్ స్టార్మర్, జెలెన్ స్కీ

అంతిమ యాత్రలో పాల్గొన్న దాదాపు లక్షన్నర మంది



## టెర్రర్ డెన్ మటాష్

ఉగ్రవాదుల రహస్య స్థావరం ధ్వంసం ● పెద్దఎత్తున ఆయుధాలు స్వాధీనం







## మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపుతాం

**ఎచ్చెర్ల:** మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఎన్డీయే ప్రభుత్వం వెన్నంటే ఉంటుందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. వారి జీవనప్రమాణాలను మెరుగుపర్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా.. వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. 'మత్స్యకారుల సేవలో' పేరుతో మత్స్యకారులకు ఆర్థిక సాయం పథకానికి చంద్రబాబు శ్రీకారం చుట్టారు. ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు వేట విరామ సమయానికి సంబంధించి భృతి కింద ఒక్కో కుటుంబానికి ఇచ్చే మొత్తాన్ని రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచిన సంగతి తెలిసిందే. మొత్తం రూ.259 కోట్ల మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం జిల్లా ఎచ్చర్ల నియోజకవర్గం బుడగట్లపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

"హైదరాబాద్ వెళ్లినా.. ఢిల్లీ వెళ్లినా శ్రీకాకుళం కాలనీ ఉంటుంది. ఆర్మీలో ఎక్కువ పని చేసేవారు ఇక్కడి వారే. 26 జిల్లాల్లో తక్కువ తలసరి ఆదాయం శ్రీకాకుళం జిల్లాదే. ఈ జిల్లాలో తెలివితేటలు, నాయకత్వానికి కొదవలేదు. స్థానికుల సమస్యలు, పేదల కష్టాలు చూశాను. నేనూ బటన్ నొక్కవచ్చు.. కానీ, మీ కష్టాలు తెలుసుకునేందుకే వచ్చా. ప్రభుత్వం

...మిగతా 2లో



### ఆహారమే ఓషధం.. వంటగదే ఔషధశాల

**విశాఖపట్నం:** ఫుడ్‌ను మెడిసిన్‌గా, కిచెన్‌ను ఫార్మసీగా భావించాలని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. రాబోయే పదేళ్లలో మనం ఎలా ఉండాలో ఇప్పుడే ఆలోచించాలన్నారు. ఆంధ్ర మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థుల సమన్వయంతో విశాఖలో నిర్మించిన అంబేడ్కర్ శతాబ్ది అలుమ్ని భవనాన్ని చంద్రబాబు ప్రారంభించారు. రూ.50 కోట్లతో ఈ

...మిగతా 2లో

## ఏం జరిగినా ఎదుర్కొంటాం

పహల్గాం ఉగ్రదాడిపై పాక్ ప్రధాని స్పందన

శాంతికే మా ప్రాధాన్యతంటూ ప్రవచనం

దర్యాప్తులో పాల్గొంటామన్న షెహబాజ్ షరీఫ్

**ఇస్లామాబాద్, ఏప్రిల్ 26:** జమ్మూకశ్మీర్ ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు

...మిగతా 2లో

## సయోధ్య కుదర్చడానికి మేం సిద్ధం.. ఇరాన్

**ఢిల్లీ, ఏప్రిల్ 26:** పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఇరాన్

...మిగతా 2లో

## పరిష్కారం భారత్-పాక్ చేతుల్లోనే

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్



**న్యూయార్క్,ఏప్రిల్ 26:** జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని అమెరికా అధ్యక్షుడు

...మిగతా 2లో

## మీడియాకు మార్గదర్శకాలు

సైనిక, భద్రతా ఆపరేషన్ల రిపోర్టింగ్‌పై నిబంధనలు

ఉల్లంఘిస్తే కఠిన చర్యలని కేంద్రం హెచ్చరిక

**హైదరాబాద్, మనం ప్రతినిధిః** సైనిక కార్యకలాపాలు, భద్రతా దళాల కదలికలకు సంబంధించి ప్రత్యక్ష ప్రసారాలు చేయవద్దని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ మీడియా సంస్థలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. దేశ భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. టీవీ ఛానళ్లు, వార్తా సంస్థలు, డిజిటల్ ప్లాట్‌ఫారమ్ లు, సోషల్ మీడియా వినియోగదారులు సహా అందరూ రక్షణ, భద్రత సంబంధిత అంశాలపై వార్తలు ఇచ్చేటప్పుడు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రస్తుత చట్టాలు,

...మిగతా 2లో



## మద్యం కుంభకోణం కేసులో సజ్జల శ్రీధర్‌రెడ్డికి రిమాండ్

**అమరావతి:** మద్యం కుంభకోణం కేసులో సజ్జల శ్రీధర్‌రెడ్డికి మే 6 వరకు ఏసీబీ కోర్టు రిమాండ్ విధించింది. సిట్ అధికారులు ఆయన్ను విజయవాడ జిల్లా జైలుకు తరలించనున్నారు. ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ యజమాని సజ్జల శ్రీధర్‌రెడ్డి మద్యం కుంభకోణం ప్రధాన కుట్రదారుల్లో కీలక నిందితుడిగా ఉన్నాడు. కేసులో ఏ6గా ఉన్న ఆయన్ను సిట్ అధికారులు శుక్రవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో అరెస్టు చేశారు. శనివారం విజయవాడకు తీసుకొచ్చి ఏసీబీ కోర్టులో హాజరుపర్చారు.

2019లో వైకాపా అధికారం చేపట్టాక నూతన మద్యం విధానం ముసుగులో నెలనెలా రూ.50-60 కోట్ల మేర ముడుపులు ఎలా కొల్లగొట్టొచ్చనే దానిపై చర్చించేందుకు నిర్వహించిన సమావేశాలన్నింటిలోనూ వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి, అప్పట్లో ఆ పార్టీ నాయకుడు విజయసాయిరెడ్డి, నాటి ఐటీ సలహాదారు రాజ్ కెసిరెడ్డి, ఏపీఎస్‌బీసీఎల్ పూర్వపు ఎండీ వాసుదేవరెడ్డి, ఏపీఎస్‌బీసీఎల్ ప్రత్యేకాధికారి సత్యప్రసాద్‌తో కలిసి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

## జగన్ లిక్కర్ స్కామ్ ఎవరెస్టును తాకుతుంది: నిమ్మల

**పాలకొల్లు:** జగన్ పాలనలో అన్ని రంగాలూ దోపిడీకి గురయ్యాయని మంత్రి నిమ్మల రామానాయుడు ఆరోపించారు. గతంలో డిస్టిబ్యూటరీల నుంచి మద్యం షాపుల వరకు జగనే పెట్టుకున్నారని విమర్శించారు. లిక్కర్, శాండ్ మైన్స్, భూముల దోపిడీపైనే జగన్ దష్టి పెట్టారన్నారు. పాలకొల్లు మండలంలో మన రైతు-మన రామానాయుడు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రూ. కోటి విలువైన పలు అభివద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. "వైసీపీ హయాంలో జరిగినంత లిక్కర్ లూటీ మరెక్కడా జరగలేదు. తెలంగాణలో డిస్టిలరీ స్కామ్‌తో పోలిస్తే జగన్ లిక్కర్ స్కామ్ ఎవరెస్టును తాకుతుంది" అని నిమ్మల విమర్శించారు.




## హై-అలర్ట్ జోన్లంటూ వదంతులు.. ఏపీ డీజీపీ హెచ్చరిక



**అమరావతి:** జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో 'భారత ప్రభుత్వం అత్యవసర భద్రతా సలహా' పేరుతో సామాజిక మాధ్యమాల్లో తప్పుడు వార్తలు ప్రచారం చేయడంపై ఏపీ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర నిఘా సంస్థల హెచ్చరికల పేరుతో కొందరు వదంతులు వ్యాప్తి చేస్తున్నారని, ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలను హై-అలర్ట్ జోన్లుగా ప్రకటించినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన అన్నారు. హై- అలర్ట్ జోన్ల గురించి భారత ప్రభుత్వం గానీ, రాష్ట్ర ప్రభుత్వంగానీ ఎలాంటి ప్రకటన చేయలేదన్నారు. ఈ తరహా వార్తలను ఎవరూ నమ్మవద్దని.. వదంతులు వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## పోలవరంపై రీసర్వే నిర్వహించాలి: షర్మిల

**అమరావతి:** జగన్ హయాంలో పోలవరం ప్రాజెక్టు సర్వే సరిగా జరగలేదని, రీసర్వే నిర్వహించి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల అన్నారు. పోలవరం నిర్వాసితులు శనివారం ఆమెను కలిశారు. తమ

...మిగతా 2లో



తిరుమలకు పెరిగిన భక్తుల రద్దీ..

## అలిపిరి వద్ద భారీగా నిలిచిన వాహనాలు

**అలిపిరి:** వేసవి సెలవులు, వారాంతం నేపథ్యంలో తిరుమలకు భక్తుల రద్దీ భారీగా పెరిగింది. శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద వాహనాలను తనిఖీ చేసే ప్రక్రియ ఆలస్యం అవుతోంది. దీంతో వాహనాలు గరుడ కూడలి వరకు నిలిచిపోయాయి. భక్తులు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. దర్శనానికి, వివిధ సేవలకు ముందస్తుగా టికెట్లు పొందిన వారు ఇబ్బందులు పడుతున్నారు. సమయం దాటితే తమను సేవలకు అనుమతించరంటూ వాపోతున్నారు.తనిఖీ కేంద్రం వద్ద 45 మంది ఎస్పీఎఫ్ సిబ్బంది, 15 మంది విజిలెన్స్ సిబ్బంది ఉన్నారు. ఈ సంఖ్యను పెంచితే తనిఖీ త్వరితగతిన అవుతుందని భక్తులు భావిస్తున్నారు.



## పాతతరం అంతరించింది.. యువత రాజకీయాల్లోకి రావాలె

కొత్త ఆలోచనలతో దేశం అభివృద్ధి సాధిస్తుంది

చట్టసభల్లో విపక్షాలకు మాట్లాడే అవకాశం రావడం లేదు

భారత్ జోడో యాత్రతో విద్వేషాల బజారులో ప్రేమ దుకాణం తెరిచినం

రాజకీయాలు ప్రజల ఇష్టానుసారమే నడవాలె

భారత్ సమ్మిట్‌లో రాహుల్ గాంధీ




**హైదరాబాద్, మనం బ్యూరోః** దేశ రాజకీయాల్లో పాతతరం అంతరించి పోయింది. ఇప్పుడంతా యంగ్ అండ్ న్యూ పాలిటిక్స్ నడుస్తున్నాయి. యువత రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజాస్వామ్య రాజకీయాల్లో చాలా మార్పులొచ్చాయనీ, గడచిన పదేళ్లలో ఏం జరిగిందో దేశ ప్రజలందరికీ తెలుసని పేర్కొన్నారు. హైదరాబాద్ నోవాటెల్ హెచ్ఐసీసీ వేదికగా రెండు రోజుల పాటు జరిగిన భారత్ సమ్మిట్ 2025 సదస్సు శనివారం ముగిసింది. ఈ సదస్సులో రాహుల్ గాంధీ కీలకోపన్యాసం చేస్తూ పదేండ్ల క్రితం నాటి పరిస్థితులు ఇప్పుడు లేవనీ, ప్రభుత్వ పాలసీలపై లోతుగా చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. చట్టసభల్లో విపక్షాలకు మాట్లాడే అవకాశం రావడం లేదనీ, అందుకే, తమ గొంతు వినిపించేందుకు కొత్త వేదికలు వెతుక్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు నాలుగు వేల కిలోమీటర్లు నిర్వహించిన భారత్ జోడో పాదయాత్ర ప్రారంభించిన సమయంలో నాతో కొద్ది మంది మాత్రమే ఉన్నారు. పది రోజుల తరువాత చూస్తే నాతో పాటు నడిచే వారి సంఖ్య పెరిగింది. ఈ యాత్రలో ఎన్నో విషయాలు


...మిగతా 2లో

భారత ఉద్యోగితలో 'వైరుధ్య' పరిణామాలు!

## ఉద్యోగాలు.. నిరుద్యోగం రెండూ పెరుగుతున్నయ్

పనిచేసే వారికంటే వేగంగా ఉద్యోగాలే పెరుగుతున్నయ్

- మరో పక్క నిరుద్యోగ యువత శాతం పెరుగుతోంది
- 29 శాతం మంది ఉన్నత విద్యావంతులు ఉద్యోగాన్వేషకులుగానే ఉంటున్నరు
- ఉపాధి కోసం పట్టణ ప్రాంతాలకు హెచ్చుతున్న వలసలు
- శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్య వృద్ధి
- మహిళా ఉద్యోగ రేటు పెరుగుతున్నప్పటికీ లింగ వివక్ష ఏమాత్రం తగ్గలేదు
- ప్రపంచ బ్యాంకు నివేదిక వెల్లడి




**హైదరాబాద్, ఏప్రిల్ 26:** భారత దేశంలో ఉద్యోగాల పెరుగుదలకు సంబంధించి ప్రపంచ బ్యాంకు ఒక నివేదిక విడుదల చేసింది. ఉద్యోగాల పెరుగుదలలో వాంఛనీయ పరిణామాలు చోటు చేసుకుంటున్నట్లు అది తెలియజేస్తుంది. 2021-22 నుంచి దేశంలోని కార్మిక మార్కెట్ డైనమిక్స్‌లో గణనీయమైన మార్పు చోటుచేసుకుందని తెలిపింది. ఇందులోభాగంగా నాటి నుంచి పని చేసే జనాభా కంటే వేగంగా ఉద్యోగాలు పుట్టుకొస్తున్నాయని వెల్లడించింది. అంతేకాకుండా శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం వృద్ధి చెందుతున్నట్లు ఆ నివేదిక తెలిపింది. గత మూడేండ్లుగా దేశంలో పనిచేసే జనాభా కంటే ఉపాధి వృద్ధి స్థిరంగా ఉందని.. పట్టణాలలో

...మిగతా 2లో

# పోప్ ఫ్రాన్సిస్ కు అంతిమ వీడ్కోలు

**వాటికన్ సిటీ, ఏప్రిల్ 26:** వాటికన్ సిటీలో 21న కన్నుమూసిన పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలు శనివారం ముగిశాయి. ఆయనకు ఇష్టమైన సెయింట్ మేరీ మేజర్ బసిలికాలో భౌతిక కాయాన్ని ఖననం చేసినట్లు వాటికన్ వర్గాలు వెల్లడించాయి. అనంతరం ఆయన సమాధి వద్ద కార్డినల్స్ ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు తెలిపాయి. అయితే, చర్చిలో అంత్యక్రియలు ప్రైవేటుగా నిర్వహించారు. కేవలం ఉన్నతస్థాయి కార్డినల్స్, పోప్ సన్నిహితులు మాత్రమే హాజరయ్యారు.

అంతకుముందు వాటికన్ సిటీలోని సెయింట్ పీటర్స్ స్క్వేర్ లో నిర్వహించిన కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సహా 50కిపైగా దేశాధినేతలు, వివిధ దేశాల నుంచి వచ్చిన ప్రముఖులు క్యాథలిక్కుల మతాధిపతికి నివాళులర్పించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరై తుది వీడ్కోలు పలికారు. వీరితోపాటు దాదాపు లక్షన్నర మంది సాధారణ పౌరులు పోప్ అంత్యక్రియలను వీక్షించేందుకు వచ్చినట్లు అంచనా. శాంటామారియా చర్చికి ఊరేగింపుగా తీసుకెళ్లే సమయంలోనూ రోమ్ వీధుల్లో లక్షలాది మంది బారులు తీరారు.

**తదుపరి పోప్ ఎవరు?.. రహస్యంగా ఎన్నుకోనున్న కార్డినళ్లు**

పోప్ ఫ్రాన్సిస్ ఏప్రిల్ 21న తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. అంతకు ఒకరోజు ముందే ఈస్టర్ నాడు ప్రజలకు సందేశం ఇచ్చిన పోప్.. జీవితసారాన్ని ప్రపంచానికి గుర్తుచేశారు. శాంతి పునరుద్ధరణ కోసం కృషి చేయాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. 1936 డిసెంబర్ 17న అర్జెంటీనాలో జన్మించిన పోప్ ఫ్రాన్సిస్.. 2013 మార్చి 13న 266వ పోప్గా ఎన్నికయ్యారు. లాటిన్ అమెరికా నుంచి పోప్గా ఎన్నికైన మొట్టమొదటి వ్యక్తిగా ఆయన ఖ్యాతి గడించారు.

# మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపుతాం: చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

బాధ్యతగా ఉండాలి. ప్రజల ఆదాయం పెంచాలి. ప్రజల జీవనప్రమాణాలను మెరుగుపరచాలి. వెనుకబడిన వర్గాల కోసం మరిన్ని కార్యక్రమాలు చేపడతాం. గత ప్రభుత్వ హయాంలో రూ.10లక్షల కోట్లు అప్పులు చేశారు. వాటితో ఏం చేశారో లెక్కలు కూడా లేవు. గతంలో ఎర్రన్నాయుడు ఉద్దానం ప్రాంతానికి నీళ్లు సాధించారు. ఎంపీ రామ్మోహన్ ఆధ్వర్యంలో ఇప్పుడు భోగాపురం విమానాశ్రయం పూర్తికాబోతోంది.

దేశంలో ఉత్పత్తయ్యే మత్స్య సంపదలో 29శాతం ఏపీ నుంచే ఉంటుంది. మత్స్య ఉత్పత్తుల ద్వారా 16.50 లక్షల మందికి ఉపాధి లభిస్తోంది. మత్స్యకారుల పిల్లల్ని బాగా చదివించే బాధ్యత తీసుకుంటాం. ఇప్పటికే 6 రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేశాం. ఎచ్చర్లలో నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తాం. స్థానిక ఉద్యోగాలు ఈ ప్రాంత వాసులకే వచ్చేలా చర్యలు తీసుకుంటాం'' అని చంద్రబాబు అన్నారు.

**జిల్లా రూపురేఖలు మారుద్దాం: రామ్మోహన్ నాయుడు**

శ్రీకాకుళం జిల్లా నుంచి వలసలను కట్టడి చేసేందుకు కష్టపడి పని చేస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్నాయుడు అన్నారు. జిల్లా రూపురేఖలు మార్చేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మత్స్యకారుల అభివద్ధి కోసం కూటమి ప్రభుత్వం కషి చేస్తోందన్నారు. జిల్లాలోని మూలపేటలో కొత్తగా పోర్టును పూర్తి చేయబోతున్నట్లు తెలిపారు. తీరప్రాంతంలో పర్యాటక అభివద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

# టెర్రర్ డెన్ మటాష్

**శ్రీనగర్, ఏప్రిల్ 26:** పహల్గాంలో ఉగ్రదాడి తర్వాత టెర్రరిస్టులను పట్టుకునేందుకు భద్రతా దళాలు తీవ్రం చేశాయి. ఈ క్రమంలో కుప్వారా జిల్లాలో గుర్తించిన ఉగ్రవాదుల రహస్య స్థావరంపై భద్రతాదళాలు దాడులు చేసి, ధ్వంసం చేశారు. ఈ క్రమంలోనే వారి స్థావరాల నుంచి భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఉగ్రస్థావరాలు ఉన్నాయని నిర్దిష్ట నిఘా వర్గాల సమాచారం మేరకు సైన్యం వారి స్థావరాలను ధ్వంసం చేయడం ఉగ్రవేటలో ముందడుగని వారన్నారు. మరోవైపు కుల్గాం జిల్లాలో ఉగ్రవాదులతో కలిసి పనిచేస్తున్న ఇద్దర్ని భద్రతా దళాలు శనివారం అరెస్టు చేశాయి. ఖైమోహ్ ప్రాంతంలో వీరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపాయి.

# ఆహారమే ఓషధం.. వంటగదే ఔషధశాల

(మొదటి పేజీ తరువాయి)

నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టెక్నాలజీ, మెడికల్ రంగాల్లో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయన్నారు. కేజీహెచ్లో రూ.60 కోట్లతో లెవల్-2 క్యాన్సర్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కేజీహెచ్ను సికెల్ సెల్ అనీమియా కేంద్రంగా కేంద్ర ప్రభుత్వం గుర్తించిందని, దానిని సెంటర్ ఆఫ్ ఎక్స్లెన్స్గా తయారు చేయాలన్నదే తన కోరికని చెప్పారు. ఢిల్లీ ఎయిమ్స్ మాదిరిగా కేజీహెచ్ను తయారు చేయడానికి కషి చేస్తామన్నారు.

ఈ భవనాన్ని ఈస్ట్, వెస్ట్ బ్లాకులుగా విభజించి నిర్మాణ పనులు పూర్తి చేశారు. ఈస్ట్బ్లాక్లో గ్రౌండ్ ఫ్లోర్తో సహా నాలుగు అంతస్తులు ఉన్నాయి. ఏఎంసీలో చదువుకుని ఉన్నతస్థాయిలో స్థిరపడిన వారి చిత్రపటాలు, వారు సాధించిన ప్రగతి.. తదితర అంశాలు వివరించేలా ఓ అంతస్తులో స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. మరో అంతస్తులో గ్రంథాలయాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఇంకో అంతస్తును విద్యా సంబంధిత కార్యకలాపాలకు వినియోగించనున్నారు. ఇదే బ్లాకులో కేఫిటేరియా రానుంది. వెస్ట్బ్లాక్లో 600 మంది సామర్థ్యంతో కూడిన అత్యాధునిక సమావేశ మందిరం ఏర్పాటు చేశారు.

## పోలవరంపై రీసర్వే నిర్వహించాలి: షర్మిల

(మొదటి పేజీ తరువాయి)

సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ.. ''జగన్ హయాంలో ప్రాజెక్టు సర్వే సరిగా జరగలేదు. రీసర్వే నిర్వహించాలి. గతంలో ఆమోదయోగ్యం కాని.. ముంపు భూములిచ్చారు. కొత్తగా తరలించిన ప్రాంతాల్లో సరైన వసతులు లేవు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో ఇతరుల పేర్లు ఉన్నట్లు ప్రజలు వాపోతున్నారు'' అని అన్నారు.

# ఏం జరిగినా ఎదుర్కొంటాం


(మొదటి పేజీ తరువాయి)

తీవ్రమయ్యాయి. మోడీ ప్రభుత్వం తీసుకున్న పలు నిర్ణయాలపై పొరుగుదేశంలోని మంత్రులు ఈపాటికే నోరు పారేసుకున్న విషయం విదితమే. ఈ పరిణామాలపై పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మొదటి సారి స్పందించారు. పహల్గాం దాడి పై తటస్థ దర్యాప్తునకు తాము సిద్ధమేనని ప్రకటించారు. ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొంటామంటూ వ్యాఖ్యానించారు. ఖైబర్ పఖ్తుంఖ్వాలోని పాకిస్తాన్మిలిటరీ అకాడమీ గ్రాడ్యుయేషన్ వేడుకల్లో పాల్గొన్న షెహబాజ్ షరీఫ్.. 'పహల్గాంలో ఇటీవల జరిగిన విషాదకర ఘటనతో మరోసారి మన దేశం నిందలు ఎదుర్కొంటోంది. ఆ ఘటనపై తటస్థ, పారదర్శక, విశ్వసనీయ దర్యాప్తులో పాల్గొనేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. శాంతికే మా ప్రాధాన్యం' అని ప్రకటించారు. ఉగ్రవాదాన్ని తాము కూడా ఖండిస్తామంటూ శాంతి ప్రవచనాలు పలికారు. ఈసందర్భంగా ఉగ్రవాదాన్ని సమూలంగా నాశనం చేస్తామంటూ ఇటీవల భారత ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలపై షరీఫ్ పరోక్షంగా స్పందించారు. 'మా దేశ భద్రత, సార్వభౌమత్వంపై ఎన్నటికీ రాజీపడబోం. ఎలాంటి ముప్పును ఎదుర్కోడానికైనా సంసిద్ధంగా ఉన్నాం' అని తెలిపారు. అనంతరం సింధూ జలాల ఒప్పందం నిలిపివేత అంశాన్ని ప్రస్తావిస్తూ.. 'భారత్ ఇలా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం తగదు. ఈ చర్యతో యుద్ధ వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని మేం కోరుకుంటున్నాం' అంటూ భారత్ ను నిందించే ప్రయత్నం చేశారు.

# ఉద్యోగాలు.. నిరుద్యోగం రెండూ పెరుగుతున్నయ్

(మొదటి పేజీ తరువాయి)

నిరుద్యోగ స్థాయిలు తగ్గుతున్నాయని నివేదిక వెల్లడించింది. 2017-18 ఆర్థిక సంవత్సరం తర్వాత పట్టణ నిరుద్యోగం తగ్గుతూ వచ్చి 2021-22 నాటికి అత్యల్పంగా 6.6 శాతానికి పడిపోయిందని ప్రపంచ బ్యాంకు పేర్కొంది. కరోనా మహమ్మారి తర్వాత దేశంలో ఉపాధి అవకాశాలు మళ్లీ మెరుగుపడ్డాయనడానికి ఇదే సంకేతమని నిపుణులు పేర్కొంటున్నారు. ఉపాధి రంగంలో గమనించదగ్గ మార్పుల్లో ఉద్యోగాల కోసం గ్రామీణ ప్రాంతాల ప్రజలు అధికంగా పట్టణ ప్రాంతాలకు వలసలు రావడం పెరిగినట్లు నివేదిక పేర్కొంది. 2018-19 తర్వాత మొదటిసారిగా.. ఉపాధి కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు పురుషుల వలసలు గణనీయంగా పెరిగాయని తెలిపింది. అయితే గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు అధికంగా శ్రామిక శక్తిలోకి, ముఖ్యంగా వ్యవసాయ వృత్తిలోకి ప్రవేశిస్తున్నట్లు వివరించింది.



మహిళా ఉద్యోగ రేటు పెరుగుతున్నప్పటికీ వేతనాల్లో లింగ అసమానతలు అలాగే ఉన్నాయని పేర్కొంది. ఉద్యోగాలు పెరుగుతున్నప్పటికీ దేశంలో నిరుద్యోగ యువత శాతం పెరుగుతుండడంపై ప్రపంచ బ్యాంకు ఆందోళన వ్యక్తంచేసింది.

భారత్ లో నిరుద్యోగ యువత 13.3 శాతం ఉందని తెలిపింది. ఉన్నత విద్యను పూర్తిచేసిన వారిలో 29 శాతం మంది ఇప్పటికీ ఉద్యోగ అన్వేషకులుగానే ఉన్నారని పేర్కొంది. 2022-23 నాటికి భారత్ లో పేదరికాన్ని తగ్గించడంలో కొంత పురోగతి సాధించినప్పటికీ, అత్యధిక జనాభా కలిగిన ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు ఇప్పటికీ దేశంలోని అత్యంత పేద రాష్ట్రాలుగా ఉన్నాయని ఆందోళన వ్యక్తంచేసింది. ఉపాధిని మరింత మెరుగుపరచడానికి స్థిరమైన ఆర్థిక సంస్కరణలు, పెట్టుబడుల పెరుగుదల అవసరమని ప్రపంచ బ్యాంకు నివేదిక స్పష్టం చేస్తోంది.

## మీడియాకు మార్గదర్శకాలు

(మొదటి పేజీ తరువాయి)

నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించింది. ముఖ్యంగా సైనిక చర్యలు జరుగుతున్నప్పుడు ప్రత్యక్ష దృశ్యాలను ప్రసారం చేయడం, సున్నిత ప్రాంతాల నుంచి లైవ్ రిపోర్టింగ్ ఇవ్వడం, 'వర్గాల సమాచారం' పేరుతో వివరాలు వెల్లడించడం వంటివి చేయరాదని స్పష్టం చేసింది. ఇలాంటి సున్నితమైన ఆపరేషన్ల వివరాలను ముందుగానే బయటపెట్టడం వల్ల శత్రు మూకలకు సమాచారం అందే ప్రమాదం ఉందని, ఇది ఆపరేషన్ల సమర్థతకు, భద్రతా సిబ్బంది ప్రాణాలకు ముప్పు కలిగిస్తుందని ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. గతంలో కార్గిల్ యుద్ధం, 26/11 ముంబై దాడులు, కాందహార్ విమాన హైజాక్ వంటి సమయాల్లో మీడియా కవరేజీ వల్ల జాతీయ ప్రయోజనాలకు నష్టం వాటిల్లిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసింది. కేబుల్ టెలివిజన్ నెట్వర్క్స్ (సవరణ) నిబంధనలు-2021లోని రూల్ 6(1)(పి) ప్రకారం భద్రతా దళాలు నిర్వహించే ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్ల ప్రత్యక్ష ప్రసారాలను నిషేధించినట్లు మంత్రిత్వ శాఖ పునరుద్ఘాటించింది.

## సయోధ్య కుదర్చడానికి మేం సిద్ధం: ఇరాన్

(మొదటి పేజీ తరువాయి)

కీలక ప్రతిపాదన చేసింది. భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలను తగ్గించి, సయోధ్య కుదర్చడానికి తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించింది. ఈ మేరకు ఆ దేశ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ మాట్లాడుతూ.. ''రెండు దేశాలూ మాకు కావాల్సినవే. మా సోదర పొరుగుదేశాలు. వాటితో మాకు శతాబ్దాలుగా సాంస్కృతిక, నాగరికత సంబంధాలు ఉన్నాయి. ఈ కష్ట సమయంలో ఉద్రిక్తతలను తగ్గించడానికి ఇస్లామాబాద్, ఢిల్లీలోని మా కార్యాలయాలను ఉపయోగించడానికి సిద్ధంగా ఉన్నాం'' అని పేర్కొన్నారు.నీ భారత్, పాకిస్థాన్ల మధ్య తాజా ఉద్రిక్తతలపై సౌదీ అరేబియా ఆందోళన వ్యక్తం చేసింది. ఆ దేశ విదేశాంగ మంత్రి ఫైసల్ బిన్ ఫర్హాన్ అల్ సౌద్ మన విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్తో, పాక్ విదేశాంగ మంత్రి మహమ్మద్ ఇషాక్ దర్తో విడివిడిగా ఫోన్లో మాట్లాడారు.

# పరిష్కారం భారత్-పాక్ చేతుల్లోనే

(మొదటి పేజీ తరువాయి)

డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఖండించారు. ఈసందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్, పాకిస్థాన్ల మధ్య కశ్మీర్ విషయంలో చాలా ఏళ్లుగా గొడవ జరుగుతోందన్నారు. అయితే, దాన్ని ఆ రెండు దేశాలే పరిష్కరించుకుంటాయని తెలిపారు. పహల్గాం ఉగ్ర దాడితో భారత్, పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలను ఆ రెండు దేశాలే పరిష్కరించుకుంటాయని ట్రంప్ అన్నారు. రోమ్ పర్యటనకు బయల్దేరిన ట్రంప్ ఎయిర్పోర్స్ వన్ విమానంలో విలేకరులతో మాట్లాడారు. ఈసందర్భంగా భారత్-పాక్ ఉద్రిక్తతలపై అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. ''ఆ రెండు దేశాలు నాకు చాలా దగ్గర. కశ్మీర్ విషయంలో భారత్, పాకిస్థాన్ల మధ్య చాలా ఏళ్లుగా ఘర్షణలు జరుగుతున్నాయి. ఇక, తాజాగా పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి ఒక చెత్త పని. ముష్కరుల దాడిలో అమాయకులు ప్రాణాలు కోల్పోవడం విచారకరం. అయితే, ఏళ్లుగా నలుగుతున్న సరిహద్దు ఉద్రిక్తతలను ఆ రెండు దేశాలే పరిష్కరించుకుంటాయి'' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఏప్రిల్ 22న పహల్గాం సమీపంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన బైసరన్ లోయలో ఉగ్రవాదులు నరమేధానికి పాల్పడిన సంగతి తెలిసిందే. సైనిక దుస్తుల్లో వచ్చినవారు పర్యాటకులను చుట్టుముట్టి అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు.

దారులన్నీ ఎల్కతుర్తికే..

# రికార్డు స్థాయిలో ఏర్పాట్లు

## కేసీఆర్, కేటీఆర్ కీలక ప్రసంగాలు

**భవిష్యత్ ప్రణాళికల ప్రకటన**

**ఉత్సాహంగా కదులుతున్న గులాబీ శ్రేణులు**

**చరిత్రలో నిలిచిపోయేలా బీఆర్ఎస్ రజతోత్సవ సభ**

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) అవతరించి 25 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వరంగల్లోని ఎల్కతుర్తిలో రజతోత్సవ సభను భారీ స్థాయిలో నిర్వహించనుంది. లక్షలాది మంది ప్రజలు హాజరయ్యే ఈ సభ కోసం రికార్డు స్థాయిలో విస్తృత ఏర్పాట్లు చేశారు. ఈ సభలో కేసీఆర్, కేటీఆర్ కీలక ప్రసంగాలు చేయనున్నారు. ఈ వేదికనుంచి బీఆర్ఎస్ పార్టీ భవిష్యత్ ప్రణాళికలను కూడా వివరించనున్నట్టు తెలుస్తోంది. ఈ సభ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపనుంది.

**బీఆర్ఎస్ రజతోత్సవ సభ..**

ఉద్యమ పార్టీగా ఆవిర్భవించి.. ప్రత్యేక తెలంగాణ సాధనే ధ్యేయంగా 14 ఏళ్ల సుదీర్ఘ పోరాటం చేసిన, తెలంగాణ రాష్ట్ర సమితి.. ఎన్ని అడ్డంకులు, మరెన్ని అవహేళనలు ఎదురైనా ఉద్యమమే ఊపిరిగా, రాష్ట్రాన్ని సాధించుకోవాలన్న ఆశనే శ్వాసగా పోరాడి చివరకు అనుకున్న లక్ష్యాన్ని ముద్దాడింది. ప్రత్యేక రాష్ట్ర సాధనే ప్రధాన లక్ష్యంగా 2001 ఏప్రిల్ 27న కేసీఆర్ (కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు) తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్)ని స్థాపించారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన టీఆర్ఎస్.. రాష్ట్రం సిద్ధించిన తర్వాత.. రెండుసార్లు అధికారంలోకి వచ్చింది. కాగా.. దేశవ్యాప్తంగా విస్తరించాలన్న ఆలోచనే లక్ష్యంగా.. 2022లో టీఆర్ఎస్ను పార్టీ అధినేత కేసీఆర్.. ఉద్యమ పార్టీ టీఆర్ఎస్ను భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)గా మార్చారు. 3వ సారీ అధికారంలోకి వస్తమనుకున్న గులాబీ పార్టీ.. ప్రస్తుతం ప్రతిపక్ష హోదాలో ఉన్నది.. టీ(బీ)ఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో.. ఈ నెల 27న భారీ స్థాయిలో రజతోత్సవ సభను అత్యంత వైభవంగా నిర్వహించేలా ప్లాన్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ చరిత్రలోనే అతిపెద్ద బహిరంగ సభగా నిలిచిపోయేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.




**రికార్డుస్థాయిలో ఏర్పాట్లు.. విశేషాలు..**

ఈ రజతోత్సవ సభను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న బీఆర్ఎస్.. తన బలం, బలగాన్ని అధికార పార్టీకి మాత్రమే కాకుండా దేశమంతా మరోసారి చూపించాలన్న లక్ష్యంతో రికార్డు స్థాయి ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం 1,213 ఎకరాల విస్తీర్ణంలో సభా ప్రాంగణాన్ని సిద్ధం చేస్తున్నారు. 154 ఎకరాల్లో ప్రధాన వేదికను ఏర్పాటు చేశారు. 500 మంది ముఖ్యనేతలు కూర్చునేలా భారీ వేదికను రూపొందించారు. 1,059 ఎకరాల్లో వాహనాల పార్కింగ్ కోసం విశాలమైన స్థలాన్ని కేటాయించారు. ఇక, వేసవి తీవ్రత దృష్ట్యా.. సభకు హాజరయ్యే వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 10 లక్షల వాటర్ బాటిళ్లు, 16 లక్షల మజ్జిగ ప్యాకెట్లను సిద్ధం చేశారు. 6 అంబులెన్సులు, 12 వైద్య శిబిరాలు, 1,200 తాత్కాలిక మరుగుదొడ్లు కూడా ఏర్పాటు చేశారు. పార్కింగ్ నిర్వహణ కోసం 2,000 మంది వాలంటీర్లు నిరంతరం పని చేయనున్నారు. అంతేకాదు.. విద్యుత్ అంతరాయం కలగకుండా 250 జనరేటర్లను ఏర్పాటు చేయటం గమనార్హం. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న కరెంట్ మీద తమకు నమ్మకం లేదని.. అందుకే.. తమ సభ కోసం ఓ 250 జనరేటర్లు ఏర్పాటు చేసుకున్నట్లు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇటీవల కామెంట్ కూడా చేశారు.

# పాతతరం అంతరించింది.. యువత రాజకీయాల్లోకి రావాలె




(మొదటి పేజీ తరువాయి)

తెలుసుకున్నా. సగం దూరం నడిచే సమయానికి నేను గతంలో మాదిరిగా లేను. ప్రజలతో ఎలా మాట్లాడాలి ? వారి సమస్యలు ఎలా పరిష్కరించాలి అనే విషయాలపై వారితో కమ్యూనికేట్ అయ్యేందుకు ప్రయత్నించి సక్సెస్ అయ్యానని వివరించారు. ఈ యాత్రలో ఓ చిన్న అమ్మాయి వచ్చి 'ఐ లవ్ యూ' చెప్పింది ఆ తరువాత నేను కూడా నా ఇష్టాన్ని ఎక్స్ప్రెస్ చేస్తూ వచ్చాను. హిందీలో ఓ స్లోగన్ తీసుకున్నాం. విద్వేషం అనే బజార్లో ప్రేమ అనే దుకాణం తెరిచా (నఫ్రత్ కే బజార్ మే మొహబ్బత్ కా దుకాన్) అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. దేశంలో మహిళలు ఎన్నో కష్టాలు ఎదుర్కొంటున్నారనీ, ఇప్పుడు సమస్యల పరిష్కారానికి ప్రజలే మార్గం చూపిస్తున్నారని పేర్కొన్నారు. రాజకీయాలు ప్రజల ఇష్టానుసారంగానే ఉండాలి కానీ, పాలకుల ప్రయోజనం కోసం కాదని స్పష్టం చేశారు. ఆధునిక సామాజిక మాధ్యమాలతో అంతా మారిపోయిందన్నారు. యువత రాజకీయాల్లోకి వచ్చినప్పుడే కొత్త ఆలోచనలు పుట్టుకొచ్చి దేశం అభివృద్ధిపథకంలో దూసుకుపోతుందన్నారు.

**సారీ... సమ్మిట్కు నిన్ననే రావాల్సింది..**

భారత్ సమ్మిట్లో పాల్గొన్న రాహుల్ గాంధీ తన ప్రసంగాన్ని సారీతో ప్రారంభించారు.

సమ్మిట్కు తాను మొదటి రోజే రావాల్సి ఉందనీ, అయితే కాశ్మీర్కు వెళ్లాను..క్షమించండి అని విజ్ఞప్తి చేశారు.

ఈ ప్రతిష్ఠాత్మక సమ్మిట్ నిర్వహిస్తున్నందుకు తెలంగాణ ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాస్వామ్య రాజకీయాలు ప్రపంచవ్యాప్తంగా మారిపోయాయనీ, ఇప్పుడంతా మోడ్రన్ రాజకీయమే కొనసాగుతోందని ఈ తరహా రాజకీయాలకు మనమంతా అలవాటుపడాలని వ్యాఖ్యానించారు.

# కర్రె గుట్టలపై బాంబుల వర్షం

- హెలికాప్టర్, డ్రోన్లతో కురిపిస్తున్న భద్రతాదళాలు
- మావోయిస్టులకు భద్రతా బలగాలకు భీకర పోరు
- 38 మంది మృతి చెందారంటూ మీడియాలో ప్రసారం
- మావోయిస్టుల పుట్టి ముంచిన లేఖ

**చర్ల, ఏప్రెల్ 26 (మనం న్యూస్):** తెలంగాణ - ఛత్తీస్గఢ్ సరిహద్దులోని కర్రెగుట్టలపై భద్రతా బలగాలు, మావోయిస్టుల నడుమ భీకరపోరుసాగుతోంది. ఇరు వర్గాలు హోరాహోరీగా తలపడుతుండటంతో కర్రెగుట్టలు రణరంగంగా మారాయి. రాత్రీపగలు తేడా లేకుండా 24 గంటలు హెలికాప్టర్లు, డ్రోన్ ల ద్వారా భద్రతా బలగాలు బాంబుల వర్షం కురిపిస్తుండటంతో సరిహద్దు గ్రామాలలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. మావోయిస్టు అగ్ర నేత హిడ్మా కూడా ఈ గుట్టలపైనే ఉన్నట్టు సమాచారం. దీనితో మావోయిస్టులకు భారీ ప్రాణనష్టం తప్పదన్న అభిప్రాయాలు వెలువడుతున్నాయి.

**ఈ తీవ్రత ఇలా ఉండగా..**

మావోయిస్టులు చేసిన చిన్న తప్పిదమే ఈ భీకర ఘర్షణకు కారణమన్న వార్తలు బాగా ప్రచారంలో ఉన్నాయి. అవే నేడు వారి ప్రాణాల మీదకు తెచ్చినట్లు సమాచారం. ఇటీవల ములుగు జిల్లా వెంకటాపురం, వాజేడు మండలాలకు చెందిన పలువురు గిరిజనులు వంట చెరుకు కొరకు కర్రెగుట్టల వద్దకు వెల్లిన క్రమంలో మావోయిస్టులు అమర్చిన మందుపాతరలు పేలి పలువురు మృతి చెందడం, తీవ్రంగా గాయపడటం జరిగింది. దీంతో మావోయిస్టులపై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో మావోయిస్టు పార్టీ స్పందించింది. మార్చి 8 వ తేదీన వెంకటాపురం - వాజేడు ఏరియా కమిటి కార్యదర్శి శాంత పేరిట లేఖ విడుదల చేసింది. తమ రక్షణార్థం కర్రెగుట్టల చుట్టూ మందుపాతరలను అమర్చామని, గుట్టల వైపు ఎవరూ రావద్దంటూ శాంత లేఖలో హెచ్చరించారు. లేఖలో పేర్కొన్న అంశాలపై నిఘావర్గాలు దృష్టి సారించాయి. కర్రెగుట్టలపై వందల సంఖ్యలో మావోయిస్టులు తలదాచుకున్నారని నిఘా వర్గాలు ప్రభుత్వానికి నివేదిక సమర్పించాయి. దీంతో వేలాది మంది భద్రతా బలగాలు కర్రెగుట్టలను చుట్టుముట్టాయి. గత ఐదు రోజులుగా మావోయిస్టులు అమర్చిన మందు పాతరలను ఒకొక్కటి వెలుపలికి తీసి వాటిని నిర్వీర్యం చేసుకుంటూ ముందుకు సాగుతున్నాయి. రెండు రోజుల క్రితం మావోయిస్టుల వేట షురూ అయింది. ముగ్గురు మావోయిస్టులు ఎన్ కౌంటర్ లో మృతి చెందినట్లు బస్తర్ ఐజి సుందర్ రాజ్ ధృవీకరించినా నేటి వరకు చనిపోయిన మావోయిస్టుల వివరాలు, మృత దేహాలను బయట పెట్టలేదు. ఇదిలా ఉండగా కర్రెగుట్టలపై రాత్రి పగలు లేకుండా భారీ బాంబు శబ్దాలు వినిపిస్తున్నాయి. మావోయిస్టులు, భద్రతా బలగాల నడుమ భీకరపోరు సాగుతున్నట్లు సమాచారం. సరిహద్దు గ్రామాలైన భీమవరం పాడు, ఊట్లపల్లి, పూజారికాంకేర్ గ్రామాల ప్రజలు బయటకు రావద్దని పోలీసులు హెచ్చరించడంతో గిరిజనులు బిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. భద్రతా బలగాలు డ్రోన్ లు, హెలికాప్టర్ల ద్వారా కర్రెగుట్టలపై బాంబుల వర్షం కురిపిస్తున్నారని పలు మీడియాలో వార్తా కథనాలు ప్రసారమయ్యాయి. 38 మంది మావోయిస్టులు మృతి చెందారంటూ ప్రముఖ టివి చానల్స్ లో వార్తా కథనాలు ప్రసారమయ్యాయి. ఈ విషయమై భద్రాతా బలగాలు, పోలీస్ అధికారులు నోరు విప్పక పోవడంతో అంతా గందరగోళంగా మారింది. మీడియా అతిగా హడావిడి చేస్తున్నారంటూ పోలీస్ అధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు సరిహద్దు ప్రాంతాలలోని వైద్యశాలలు, అంబులెన్స్ లను సిద్దం చేసారు.






## మే 11 నుంచి శ్రీ పద్మావతి అమ్మవారి వసంతోత్సవాలు

- మే 6న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**తిరుపతి, ఏప్రిల్ 26 మనం న్యూస్ :** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో మే 11 నుండి 13వ తేదీ వరకు వార్షిక వసంతోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం మే 10వ తేదీ సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ నిర్వహిస్తారు. భక్తులు ఒక్కొక్కరు రూ.150/- చెల్లించి వసంతోత్సవంలో పాల్గొనవచ్చు.

ఉత్సవాల్లో భాగంగా మే 12వ తేదీ ఉదయం 9.45 గంటలకు స్వర్ణ రథోత్సవం కన్నులపండువగా జరుగనుంది. వసంతోత్సవాలు జరిగే మూడు రోజులు మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం 4.30 గంటల వరకు శుక్రవారపు తోటలో అమ్మవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. రాత్రి 7.30 నుండి 8.30 గంటల వరకు ఆలయ నాలుగు మాడ వీధుల్లో అమ్మవారు విహరించి భక్తులను కటాక్షించనున్నారు.

**మే 6న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం**

శ్రీ పద్మావతీ అమ్మవారి వార్షిక వసంత్సోవాలను పురస్కరించుకుని మే 6వ తేదీ ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి ఉదయం 6 నుండి 9 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేయనున్నారు. నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు. ఉదయం 9 గంటల నుండి భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతిస్తారు. ఈ ఉత్సవాల కారణంగా మే 6 మరియు మే 10 నుండి 13వ తేదీ వరకు కల్యాణోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

# కిశోర బాలికల భద్రతే - దేశ భద్రత

- జిల్లా స్థాయి శిక్షణలో పిడి వెంకటేశ్వరి

**చిత్తూరు, ఏప్రిల్ 25 మనం న్యూస్ :** కిశోర బాలికల భద్రతే దేశ భద్రత అని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ డి. వెంకటేశ్వరి అన్నారు. స్థానిక కలెక్టరేటు లోని డి.ఆర్.డి.ఏ. సమావేశ మందిరంలో శనివారం జిల్లా స్థాయిలో కిశోరవికాసం- సమ్మర్ స్పెషల్ కార్యాచరణపై మండల స్థాయి నుండి వివిధ శాఖల నుండి హాజరైన నోడల్ ఆఫీసర్లకు మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి డి. వెంకటేశ్వరి హాజరయ్యారు. రిసోర్స్ పర్సన్స్ గా జిల్లా బాలల పరిరక్షణ అధికారి (డీసీపీఓ) డాక్టర్ దాసరి సుబ్రహ్మణ్యం, ఐరాల ఎంపిడిఓ ధనలక్ష్మి, గర్ల్ చైల్ డెవలప్మెంట్ అధికారిణి ఇంద్రాణి, ఆర్.బి.ఎస్.కె. జిల్లా కో-ఆర్డినేటర్ డా. గిరి, టెక్నికల్ ఎక్స్పర్ట్ (మెప్మా) వెంకటరమణ, ఐరాల సిడిపిఓ నిర్మల, డిఆర్డిఏ జ్యోతి (యాంకర్), మహిళా పోలీసు రేవతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిడి వెంకటేశ్వరి మాట్లాడుతూ, కిశోర బాలికల సాధికారతలో భాగంగా వేసవి సెలవుల యందు రాష్ట్ర ప్రభుత్వంచే రూపొందించబడిన ప్రత్యేక క్యాలెండర్ విడుదల చేస్తూ గ్రామాలలో వారికోసం ప్రత్యేక కార్యాచరణ అమలు చేయడానికి ఈ రోజు మండల స్థాయి అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. అలాగే బాల్య వివాహాలను




నివారించడానికి అన్ని శాఖలు కలిసి సమన్వయంతో పని చేయాలని, కిశోర బాలికల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడదామని పిలుపునిచ్చారు. అంతేగాక కిశోరి వికాసం కార్యక్రమం బాలికల సాధికారతకు, వారి జీవితాలను మెరుగుపరచడానికి ఒక ముఖ్యమైన అడుగుగా నిలుస్తుందదని తెలిపారు. నేటి సమాజంలో తల్లిదండ్రులకు బాలికల భద్రత రోజురోజుకీ సవాలుగా మారుతోందని, కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వారిని చైతన్యవంతులు చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నదని తెలిపారు. నేడు చాలా వరకు అన్నీ పోటీ పరీక్షలలో బాలికలదే పైచేయిగా ఉన్నప్పటికీ, ఎంతో మంది కిశోర బాలికలు తమ కళలను నెరవేర్చుకోక ముందే బాల్య వివాహాలకు బలైపోతున్నారని, మరి కొంతమంది బాల కార్మికులుగా మారిపోతున్నారని చెప్పారు. మరొకవైపు బాలికలు ఇంటా బయట, తెలిసిన వ్యక్తుల ద్వారా లైంగిక వేదింపులకు గురై చెప్పుకోలేక తమలో తామే కుమిలిపోతునా న్నరన్నారు. మరికొంత మంది తెలియని తనంతో ప్రేమ పేరిట ప్రలోభాలకు గురై, నమ్మి మోసపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. కిశోరి వికాసం లాంటి మహత్తర కార్యక్రమాన్ని అన్నీ శాఖల బాధ్యతగా తీసుకుని మన రేపటి పౌరులైన కిశోరి బాలికలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదీ అన్నారు. ముఖ్యంగా కిశోర బాలికలను తమను తామే రక్షించుకునే విధంగా తయారు చేయడమే ఈ కార్య క్రమం యొక్క ప్రధాన లక్ష్యమని వివరించారు. ఐరాల ఎం.పి.డి.ఓ. ధనలక్ష్మీ మాట్లాడుతూ, బాల్య వివాహాలు చేయడం వల్ల వారి మానసిక పరిస్థిత సరిగ్గా ఉండక పోవడం, మానసిక ఒత్తిడికి గురికావడం లాంటి కారణాల చేత ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరమన్నారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి రిసోర్స్ పర్సన్స్ పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా కిశోరి వికాసం కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యాలు, ఈ కార్యక్రమాన్ని గ్రామ, వార్డు స్థాయిలో అమలు చేయడంలో వివిధ శాఖల పాత్ర గురించి, ముఖ్యంగా సమ్మర్ స్పెషల్ ప్రోగ్రామ్ మే నెల 2 వ తేదీ నుండి జూన్ 10 వ తేదీ వరకు నిర్వహించవలసిన ప్రణాళిక గురించి, కిశోర బాలికలతో చర్చించవలసిన అంశాల గురించి వివరంగా తెలియజేశారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి నుండి పలు మండల విద్యాధికారులు, కమ్యూనిటి హెల్త్ అధికారులు, ఏపిఎంలు, ఐసిడిఎస్ సూపర్వైసర్లు, మహిళా పోలీసులు, మహిళా శిశు సంక్షేమ అధికారులు హాజరయ్యారు.

# శ్రీసిటీని సందర్శించిన సెజ్‌ల మార్గదర్శకుల బృందం

- దేశానికి ఉత్తమ నమూనాగా శ్రీసిటీకి ప్రశంస



**శ్రీసిటీ, ఏప్రిల్ 25, మనం న్యూస్ :** సెజ్ పాలసీ లక్ష్యాలకు ధీటుగా అభివృద్ధి చెందిన శ్రీసిటీ పారిశ్రామికవాడ దేశానికి ఉత్తమ నమూనాగా కేంద్ర వాణిజ్య శాఖ మాజీ కార్యదర్శి జి.కె.పిళ్లై అభివర్ణించారు. దేశంలో సెజ్ ల రూపకల్పనలో కీలక భూమిక పోషించిన పలువురు మాజీ కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు శుక్రవారం శ్రీసిటీని సందర్శించారు. దేశంలో సెజ్లు స్థాపించి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ సందర్శన చోటుచేసుకోవడం ప్రత్యేకతను సంతరించుకుంది. జి.కె.పిళ్లై ఆధ్వర్యంలో విచ్చేసిన వీరికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ స్థాపన నుంచి ఇప్పటివరకు సాధించిన అభివృద్ధి, విజయాలు, ఇతర పలు ప్రత్యేకతలను వారికి వివరించారు.

శ్రీసిటీ పరిసరాల సందర్శన అనంతరం పరిశ్రమల ప్రతినిధులతో నిర్వహించిన ప్రత్యేక చర్చా కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, సెజ్ పాలసీ మార్గదర్శకులు శ్రీసిటీ పర్యటనకు రావడం తనకు ఆనందంగా, గర్వంగా ఉందని వ్యాఖ్యానించారు. శ్రీసిటీ స్థాపన సమయంలో వారు అందించిన విశేష ప్రోత్సాహం, సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆ సమయంలో వారితో తన అనుబంధాన్ని నెమరువేసుకున్నారు. 2005 ప్రత్యేక ఆర్థిక మండలాల చట్టం అమలులో అప్పటి కేంద్ర వాణిజ్య కార్యదర్శి జి.కె.పిళ్లై ప్రధాన పాత్ర పోషించారన్నారు. ఆయన హయాంలో 325 సెజ్ ల ఏర్పాటుకు మార్గం సుగమం కాగా, తద్వారా భారతదేశ ఎగుమతి పర్యావరణ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. సెజ్ ల రూపంలో దేశ ఆర్థిక ప్రగతికి బాటలు పడ్డాయన్నారు. శ్రీసిటీతో ఎంతో అనుబంధం కలిగిన ప్రముఖ వ్యక్తుల రాక, సొంత ఇంటికి వచ్చిన భావన కలిగిస్తోందన్నారు. వారి పరిశీలనలు, సూచనలు తమకు మరింత ప్రేరణ కలిగిస్తాయన్నారు. అతిథులతో అర్థవంతమైన చర్చల్లో పాల్గొనాలని పరిశ్రమ ప్రతినిధులను కోరారు.

బంజరు భూమి నుంచి అద్భుత పారిశ్రామిక నగరంగా శ్రీసిటీ రూపాంతరం చెందడం ఆశ్చర్యానికి గురిచేసిందన్న పిళ్ళై, ఈ సందర్శన తనకెంతో ఆనందం కలిగించిందన్నారు. రవీంద్ర సన్నారెడ్డి దార్శినికతతో మారుమూల గ్రామీణ ప్రాంతం ప్రపంచ స్థాయి వ్యాపార నగరంగా మారిందని ప్రశంసించారు. ఆదర్శనీయమైన భూసేకరణ విధానంతో పరిశ్రమ, ఉపాధి, సుస్థిరత సమ్మేళనంతో శ్రీసిటీ సాధించిన ప్రగతి సెజ్ లక్ష్యాలను నెరవేర్చిందని ఆయన పేర్కొన్నారు.

శ్రీసిటీ పెట్టుబడి-స్నేహపూర్వక పర్యావరణ వ్యవస్థను సిబిఐసి సభ్యులు యోగేంద్ర గార్గ్ కొనియాడారు. పలు అనుకూలతలు వున్న శ్రీసిటీ, ఇతరులు అనుసరించాల్సిన ఒక ఉత్తమ నమూనాగా ఆయన పేర్కొన్నారు. ఇంకా పర్యటన బృందంలోని గోవా మాజీ చీఫ్ సెక్రటరీ, జోనల్ డెవలప్మెంట్ కమిషనర్ బి.విజయన్, మాజీ ఐఆర్ఎస్ అధికారి బిజోయ్ బిహారీ మోహపాత్రా, మాజీ ఐటిఎస్ అధికారి ఎల్.బి.సింఘాల్, సెజ్ ల అసోచామ్ కౌన్సిల్, ఇండస్ట్రియల్ పార్కులు వేర్హౌసింగ్ మండలి మాజీ కోచైర్మన్ హితేంద్ర మెహతా క్లుప్తంగా తమ అభిప్రాయాలను వెల్లడించారు.

ప్రశ్నోత్తరాల సమయంలో శ్రీసిటీలోని సిద్ధార్థ లాజిస్టిక్స్ ఎండీ నిశ్చల్ పాధ్యా, మిలింద్ ముంగికర్ (డైరెక్టర్, జెన్ లినెన్), మోహన్ ( రాక్వర్త్), మరికొందరు పలు అంశాలపై సందేహాలను లేవనెత్తగా, యోగేంద్ర గార్గ్, పిళ్లై, ఇతర బృంద సభ్యులు సమగ్ర వివరణ ద్వారా వారి సందేహాలను నివృత్తి చేశారు.

అనంతరం సందర్శకులు స్థానిక ట్రిపుల్ ఐటీ క్యాంపస్ కు వెళ్లి, అక్కడ విద్యార్థులు, అధ్యాపకులతో సంభాషించారు. అక్కడ విద్యా విధానం, పరిశ్రమతో అనుబంధం తదితర అంశాలపై ఆరా తీసి, తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

# నేర సమీక్ష-సమావేశం నిర్వహించిన తిరుపతి జిల్లా ఎస్పీ

**తిరుపతి, ఏప్రిల్ 26 మనం న్యూస్ :** తిరుపతి పోలీస్ గెస్ట్ హౌస్ లోని కాన్ఫరెన్స్ హాల్ నందు అధికారులతో జిల్లా ఎస్పీ. హర్షవర్ధన్ రాజు నేర సమీక్ష సమావేశం నిర్వహించినారు.

జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రేవ్ కేసులపై పోలీసు స్టేషన్ వారిగా వివరాలు అడిగి తెలుసుకున్నారు.

గ్రేవ్ కేసులు ఆలస్యం అవడానికి గల కారణాల పై వివరణ అడిగారు. గ్రేవ్ కేసు విచారణ వేగవంతం చేసి సాధ్యమైనంత త్వరగా నేరస్తులను పట్టుకోవాలన్నారు. సంవత్సరాల తరపడి గ్రేవ్ కేసులు ఎందుకు పెండింగ్ లో ఉన్నాయి.. టెక్నికల్ గా ఎమైన సమస్యలు ఉంటే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలన్నాను. అవసరమైతే ప్రత్యేక టీం లను ఎర్పాటు చేసి కేసును ఛేదించాలని ఆదేశించారు.ఈ సారి వచ్చే క్రైం మీటింగ్ లో గ్రేవ్ కేసులను తగ్గించే విధంగా ఉండలని ఆదేశించారు..

**మిస్సింగ్ కేసుల పై ప్రత్యేక దృష్టి పెట్టాలి**

**మిస్సింగ్ కేసులు లో సంబధించిన వారితో**

మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకోవాలన్నారు. మిస్సింగ్ అయిన అత్యంత సన్నిహితులను, పక్కింటి వారిని, బంధువులను విచారించడం



వల్లన వాళ్ళను పూర్తి స్థాయిలో సమాచారం వస్తుందని ఇబ్బందికి సూచించారు..కేసులకు సంబంధించిన ఛీఫ్ ఫైల్స్ ను సిబ్బంది వద్ద నుండి తీసుకుని పరిశీలించి, సూచనలు చేశారు.. ఎప్పటికప్పుడు ఇన్వెస్టిగేషన్ చేసి అప్డేట్ చెయ్యాలని ఆదేశించారు. మిస్సింగ్ కేసుల పురోగతికి సంబంధించి ప్రతి రోజు ఒక గంట సమయం కేటాయించి విచారణ వేగవంతం చేయాలన్నారు. మిస్సింగ్ కేసులకు సంబంధించి కేసులను చేయించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఈ మధ్యకాలంలో రిపోర్ట్ ఐన కేసులు ను విచారించి, వీలైంత త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలి. మన సిబ్బంది చేసేపనిలో క్వాలిటీ గా చెయ్యండి..ప్రతి ఒక్కరికి జవాబు దారి తనం తో పనిచేయాలి. 2021 సంవత్సరం నుండి హౌస్ బ్రేకింగ్ కేసులపై సమీక్ష చేశారు. ఇళ్ళలో దొంగతనాలపై దృష్టి పెట్టడంతో పాటు జైలు నుండి విడుదల అయిన నేరస్థుల కదలికల పై ప్రత్యేక దృష్టి పెట్టండి. గూడూరు, నాయుడు పేట, పుత్తూరులలో సబ్ డివిజన్ లలో నేల పదిహేను రోజులలో కేసులలో పురోగతి బాగుంది. హౌస్ బ్రేకింగ్ కేసుల రికవరీ చేయడం అలసత్వం వహించవద్దు. కేసు ప్రాదాన్యతను బట్టి ప్రత్యేక టీం లను ఎర్పాటు చేసుకుని కేసులను ఛేధించే విధంగా చర్యలు తీసుకోవాలి. కేసుల విషయంలో ఆలస్యం చెయ్యవద్దు...ఎన్ఫోర్స్మెంట్ ను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలి...ప్రతి నెల మీ మీ పని తీరు పెంచే విధంగా చోరవ చూపండి. యాక్సిడెంట్ జరుగుతున్న స్పాట్స్ గుర్తించాలి. యాక్సిడెంట్ నివారణ కు చర్యలు తీసుకోవాలి. ఎదైన యాక్సిడెంట్ జరిగినప్పుడు ఎవరైనా చనిపోయిన, కాలు, చేయి కోల్పోయిన ఆలోటు ఎవ్వరూ తీర్చలేనిది ఆ కుటుంబంలో వారికి తీరని బాధ గాఉంటుంది. ఆ ప్రాణాన్ని మనం కాపాడే విధంగా ట్రాఫిక్ సిబ్బంది చర్యలు తీసుకోవాలి. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలి.రద్దీగా ఉండే ప్రదేశాలలో అవసరం ఉన్న చోట్ల బారిగెట్లు పెట్టండి. జాతీయ రహదారులో రాత్రి సమయంలో స్టాప్ అండ్ వాష్ ప్రోగ్రామ్స్ చేయండి. వేసవికాలం సెలవులు కావడంతో తిరుమలకు భక్తుల రద్దీ పెరుగుతుంది. ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు జరగకుండా చేయాలని తిరుమల పోలీసు సిబ్బందిని ఆదేశించారు. చెక్ పోస్టు లను వద్ద ఫోర్సులను పెంచి అందరూ అలర్ట్ గా ఉండాలి. తిరుమలలో విజిబుల్ పోలిసింగ్ పెంచాలన్నారు. ప్రతి సబ్ డివిజన్ లో ఉన్న డి ఎస్పీ లు నాన్ బెయిల్ బుల్ వారెంట్స్ పై క్లియర్ చేసుకునేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వీటి పై ప్రత్యేక టీంలను కూడా ఏర్పాటు చేసుకోవాలని అదేశించారు. ఇప్పటి వరకు పెండింగ్ లో వున్నా నాన్ బెయిల్ వారంట్స్ క్లియర్ చేయాలన్నారు. పిర్యాదు ల పట్ల మీరు బాగా స్పందిస్తున్నారు. కొంతమంది స్పందన అరకొరగా ఉంది.. వాళ్ళు కూడా పద్దతి మార్చుకోవాలి. జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఓపెన్ బూసింగ్, పిల్ల నిద్ర, బహిరంగ ప్రదేశాలలో పరిసరాల పరిశుభ్రత పట్ల ప్రజల నుండి ఎలాంటి స్పందన వస్తుందని అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుండి మంచి స్పందన వస్తుందని సిబ్బంది ఎస్పీ గారికి చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు శ్రీ జే. వెంకట్రావు పరిపాలన, నాగభూషణరావు క్రైమ్స్, ఐ. రామకృష్ణ తిరుమల, జిల్లాలో డిఎస్పీలు మరియు సిఐలు సిబ్బంది పాల్గొన్నారు.

# మూగజీవాల ఆరోగ్య సంరక్షణలో పశువైద్యుల సేవ అనిర్వచనీయం

- జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్

**రాయచోటి ఏప్రిల్ 26 మనం న్యూస్ :** మూగజీవాల ఆరోగ్య సంరక్షణలో పశువైద్యుల సేవ అనిర్వచనీయమని జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పేర్కొన్నారు. శనివారం ఉదయం రాయచోటి




కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో జిల్లా సంయుక్త కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ పశు వైద్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ పశువైద్యుల సేవలను గౌరవించడం మరియు పశువుల ఆరోగ్య సంరక్షణలో వారి పాత్రను గుర్తించడానికి ప్రపంచ పశు వైద్య దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఏప్రిల్ చివరి శనివారం రోజున జరుపుకుంటున్నామన్నారు రాష్ట్రంలో గ్రామీణ ప్రజల ముఖ్య జీవనాధారం వ్యవసాయము మరియు పశు పోషణ అని పేర్కొన్నారు పశు పోషణలో రైతులకు గొర్రెలు, మేకలు పందుల మాంసం కోళ్ల నుంచి గుడ్లు మాంసం ఉత్పత్తితో పెంపకందారులకు ఆదాయం లభిస్తుందన్నారు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కొన్ని కోట్ల మూగజీవాలకు పశువైద్య సిబ్బందే కొండంత అండగా నిలుస్తున్నారన్నారు పశు ఆసుపత్రుల్లో మందులు పంపిణీ చేయడంతో పాటు వాటి పునరుత్పత్తికి కృత్రిమ గర్భధారణ శస్త్రచికిత్సలు వ్యాధి నిరోధక టీకాలు సంచార వాహనాల ద్వారా పశువులకు ఇంటి వద్దే అత్యవసర వైద్య సేవలు అందిస్తున్నారు అన్నారు మూగ జీవాలను చీదరించుకోకుండా విశిష్ఠ సేవలు అందిస్తున్న పశువైద్యులను గౌరవించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.

ఈ సందర్భంగా డిఆర్ఓ మధుసూదన్ రావు మాట్లాడుతూ పశు వైద్యులు కేవలం జంతు వైద్యులు మాత్రమే కాదని ప్రజారోగ్య రక్షణలో ఫ్రంట్ లైన్ వారియర్స్ అని కొనియాడారు పశువులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ప్రజారోగ్యం బాగుంటుందన్నారు ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలో ప్రజలు మరియు పశువులు కలిసి జీవించడం జరుగుతుందని పశువుల ఆరోగ్యం బాగుంటేనే గ్రామీణ ప్రజల ఆరోగ్యం బాగుంటుందన్నారు తనకు స్వతహాగా మూగజీవాలంటే ప్రేమ అని తనకు కూడా పశు వైద్య అంటే ఇష్టమని అయితే అనుకొని పరిస్థితులలో రెవెన్యూ శాఖ అధికారిగా పనిచేస్తున్నానన్నారు మూగజీవాలు కేవలం గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మాత్రమే సేవలందించడం లేదని పోలీసు శాఖ అధికారులకు శాంతి భద్రతల పరిరక్షణలో విశేష సేవలు అందిస్తున్నాయన్నారు.

ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్ పిళ్ళై మాట్లాడుతూ మూగజీవాల సంరక్షణలో ఉన్న పశుసంవర్ధక శాఖ అధికారిగా ఉన్నందుకు మరియు వాటి సంరక్షణ మరియు పోషణలో భాగమైనందుకు ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు ఈ సంవత్సరం పశువైద్య దినోత్సవాన్ని ₹'యానిమల్ హెల్త్ టేక్స్ ఎ టీం₹' అనే దీంతో జరుపుకుంటున్నామన్నారు. మహాత్మా గాంధీ చెప్పినట్లుగా ఒక దేశ నైతిక అభివృద్ధి ఆ దేశ పశువుల పట్ల ప్రజలు ప్రవర్తించే విధానంపై ఆధారపడి ఉంటుందన్నారు ఏ దేశమైనా ఆర్థిక అభివృద్ధి తో పాటు నైతిక అభివృద్ధి సాధించినప్పుడే అభివృద్ధి చెందిన దేశంగా పరిగణించబడుతుందన్నారు నైతిక అభివృద్ధి సాధించాలంటే పశువుల పట్ల మానవతా దృక్పథంతో ఉండాలనన్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మూగజీవాలకు సేవలు అందించడం ఎంతో ఆనందం కలిగిస్తుందన్నారు జిల్లాలోని పలు పశువైద్యశాలలలో టాయిలెట్లు సరిగా లేవని వాటికి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారిని కోరారు.

ఈ సందర్భంగా అత్తిరాల పశు వైద్యురాలు డాక్టర్ భాగ్యవతి మాట్లాడుతూ ప్రస్తుత సామాజిక పరిస్థితులలో ఉమ్మడి కుటుంబాలు కనుమరుగైన నేపథ్యంలో మూగజీవాలు మనుషులకు అండగా నిలుస్తున్నాయని వాటికి సోకే వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

ఈ సమావేశంలో డిఆర్ఓ మధుసూదన్ రావు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్ పిళ్ళై మదనపల్లి రాజంపేట రాయచోటి ఉపసంచాలకులు సత్యనారాయణరావు విజయభాస్కర రావు విజయకుమార్ మరియు సహాయ సంచాలకులు జిల్లాలో పనిచేస్తున్న పశు వైద్యులు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక హక్కుల సాధనకై పోరాటాలకు సిద్ధం కండి




**సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పిలుపు**

**తిరుపతి, ఏప్రిల్ 26 మనం న్యూస్:** మే డే స్ఫూర్తితో కార్మిక వర్గం తమకు జరుగుతున్న అన్యాయాలపై పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ తిరుపతి నగర కార్యదర్శి, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పి.వెంకటరత్నం పిలుపునిచ్చారు. తిరుపతి నారాయణపురం లోని ఐఎఫ్టియు కార్యాలయంలో శనివారం 139వ మే డే గోడపత్రికలను సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ తిరుపతి నగర కార్యదర్శి పి.వెంకటరత్నం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడే విప్లవస్ఫూర్తితో ప్రపంచ కార్మిక వర్గం, భారత కార్మిక వర్గం హక్కులు, సౌకర్యాలు, వేతనాల కోసం చేసిన అనేక పోరాటాల ఫలితంగానీ నేడు కార్మిక చట్టాలు అమలు అవుతున్నాయని తెలిపారు. అయినప్పటికీ కార్మిక వర్గ సమస్యలు అనేకం అపరిష్కృతంగానే ఉన్నాయని వీటి పరిష్కారం కోసం ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రధానంగా కార్మిక చట్టాలను కుదించి నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చి కార్మికుల హక్కులను కాలరాసి, బడా కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా మార్చిన కేంద్ర వైఖరి పై పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే కనీస వేతనం నెలకు 26 వేలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, ప్రభుత్వ రంగ పరిశ్రమలను అమ్మడం ఆపాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, స్కీం రంగాల కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, అసంఘటితరంగా కార్మికులందరికీ ఉద్యోగ భద్రత, పిఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ ఇతర చట్టబద్ధ హక్కులను పాలకులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీటి సాధనకు మే డే రోజున కార్మికులు కంకణ బద్దలు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు తిరుపతి కన్వీనర్ ఈ లోకేష్, పిఒడబ్ల్యు తిరుపతి జిల్లా కన్వీనర్ అరుణ, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు పి. రాణి, ఎ.నందిని, వి.జ్యోతి, పి.లక్ష్మీ కళ, పి.నిర్మల, స్వప్న అలాగే లక్ష్మీ, సుబ్రమణ్యం, ఎ.మోహిత్ తదతరులు పాల్గొన్నారు.

## శాంతి యజ్ఞం

కరోనా చీకటి కోరల్లోంచి మేలుకొని
ఇప్పుడిప్పుడే
వెలుగు రేఖల్ని ఆస్వాదిస్తున్న వాళ్ళము

కాళ్ళు ముడుచుకొని ముడుచుకొని
ఇరుకు ఇరుకుగా కదిలిన వాళ్ళం
ఇప్పుడిప్పుడే
సువిశాల ప్రపంచం అనుభవిస్తున్న వాళ్ళము

స్వతంత్ర భారతంలో
చెంగు చెంగున ఎగిరి దునికే జింకపిల్లలం
పల్లె దాటినా పట్నం దాటినా
పంజా విసిరే పులులుంటాయని తెలుసు
మనుషుల రూపంలో హైనాలు తిరుగుతాయని
గుండెలు చీల్చి నెత్తురు తాగుతాయని
తెలుసూ

భూలోక స్వర్గంలో
నరకపు లోయలుంటాయని
మనుషుల్ని శవాలు చేసి
పండుగ చేసుకునే రాక్షసులు ఉంటారని
తెలుసూ

అయినా
ప్రేమ లోకంలో
రెక్కలు కట్టుకుని ఎగురుతున్న పక్షులం
ఒక పక్షి నేల కూలితే
ఇంకో పక్షి కన్నీరయితే
గురి పెట్టిన బాణం కూడా ఘంటమయ్యి
మహాకావ్యం పాడుతుందని నమ్మిన వాళ్ళం

శాంతి దేశంలో పుట్టినందుకు
శాంతి స్థాపనకు ఆహుతి అయ్యే సమిధలం.

**- గజ్జెల రామకృష్ణ**
8977412795

# నీతి కథలతో పిల్లల్లో మనోవికాసం.. !



కథలు చెప్పడం అనాదిగా వస్తున్న సదాచారం. చిన్నతనంలో పిల్లలు అన్నం తినడానికి మారాం చేస్తే అనగనగా ఒక రాజు అంటూ నీతి కథలు చెప్పేవాళ్లు. అమ్మ, నాన్న, తాత, నాన్నమ్మ లేదా అమ్మమ్మలు కథలు చెబితే జోలపాట వలె వింటూ నిద్రలోకి జారుకునే వారు చంటి పిల్లలు. అమ్మమ్మ



కథలు పిల్లల జీవితాలను మార్చుతాయని సామెత కూడా ఉన్నది. నేటి డిజిటల్ యుగంలో కథలు చెప్పే ఓపిక పెద్దలకు, కథలు వినే శ్రద్ధ పిల్లల్లో క్రమంగా తగ్గుతోంది. అన్ని వయస్సుల వారికి కథలు వినడం చాలా ఇష్టంగా ఉండేది. ముఖ్యంగా పిల్లలు నీతి కథలు, నాటి చందమామ కథలు, అలనాటి బాలమిత్ర కథలు వినడానికి ఆసక్తి చూపే వారు. నాటి ఉమ్మడి కుటుంబాల్లో తాతలు, అమ్మమ్మలు, నాన్నమ్మలు ఆయా కుటుంబాల్లోని పిల్లలు, యువతకు రామాయణ మహాభారత కథలను ఆసక్తికరంగా వివరించే వారు. ఆ కథలను జీర్ణించుకున్న పిల్లలు తమ మనో విస్తృతిని పెంచుకుంటూ సన్మార్గంలో నీతి నియమాల చట్రంలో గౌరవంగా జీవించే ప్రయత్నాలు చేసేవారని మనకు తెలుసు. తరతరాలుగా కథలు ఒకరి నుంచి మరొకరికి చెప్పబడుతూనే ఉన్నాయి, విలువల బోధనలు జరుగుతూనే ఉన్నాయి. ఇలా రాబోయే తరానికి జీవన విలువలను పరిచయం చేయడానికి కథలు చెప్పడం ఎంత ముఖ్యమో తెలపడానికి ప్రతి ఏట ఏప్రిల్ 27న జాతీయ కథలు చెప్పే దినోత్సవం లేదా నేషనల్ టెల్ ఏ స్టోరీని పాటించడం ఆనవాయితీగా మారింది.

**కథలు వినడం, చెప్పడం వల్ల పలు ప్రయోజనాలు:**

కథలు అనేక రకాలుగా ఉంటాయి. మనం ఒక పుస్తకం చదివి లేదా మన అనుభవం నుంచి తెలుసుకొని మరో తరానికి చెప్పడం పెద్దల బాధ్యత అని మరువరాదు. చిన్నతనంలో విన్న పిల్లలు కథలు చెరగని ముద్రలు వేస్తూ జీవితాంతం వారికి మార్గనిర్దేశనం చేస్తాయి. మన బంధువుల్లో లేదా మిత్రుల కుటుంబాలకు చెందిన పిల్లలు, యువతతో నీతి కథలు పంచుకోవడం ఒక సదాచారమే కాదు అది వారి జీవితంలో ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంటుంది. కథలు చెప్పడం వల్ల చెప్పిన వారికి, విన్న వారికి మధ్య సత్సంబంధాలు నెలకొంటాయి. అమెరికాలో ప్రారంభమైన జాతీయ కథలు చెప్పే దినం సందర్భంగా ప్రజలు కథలు ఇతరులకు పంచుకోవడం వల్ల భావోద్వేగాల నియంత్రణ కమ్యూనికేషన్, క్రియేటివిటీ, అవగాహన, ఆత్మవిశ్వాసం, మనో విస్తృతి, ఒకరినొకరు కనెక్ట్ కావడం, సామాజిక వాతావరణం సృష్టించడం, ఆలోచనాశక్తి పెరగడం, విమర్శనాత్మక ఆలోచనలు ప్రోత్సహించబడడం, భాషపై పట్టు, ప్రేరణ, కొత్త పరిచయాలు, సృజనాత్మక, వినడమనే సుగుణం, సంస్కృతీ వారసత్వాల వితరణ, వాక్కు, కొత్త ఆలోచనలు పురుడు పోసుకోవడం, దయ/సహానుభూతి, ఆశావహ దృక్పథం, ప్రపంచాన్ని చూసే దృక్కోణం, ఇతర నైపుణ్యాలు లాంటివి పెరుగుతాయి.

**మౌఖిక కథల నుంచి ఏఐ కథల వరకు..:**

కథలు చెప్పడంలో మౌఖిక, డిజిటల్, దృశ్య, వ్రాతపూర్వక రూపాలు ఉన్నాయి. సినిమాలు, పుస్తకాలు, కవితలు, పాటలు, పెయింటింగ్లు కూడా కథలు చెప్పే రూపాల్లోకి వస్తాయి. మౌఖిక కథలు చెప్పడం అంటే పురాణ పద్యాలు, శ్లోకాలు, ప్రాసలు, పాటలు లాంటి రూపాలు ఉండవచ్చు. కథలు చెప్పడం పట్ల మక్కువ ఉంటే అనేక కెరీర్ అవకాశాలు (స్క్రీన్ రైటర్, సృజనాత్మక రచయిత, సినీ దర్శకులు, వీడియో గేమ్ రచయితలు, కంటెంట్ స్ట్రాటజిస్టులు, పాడ్కాస్ట్ నిర్మాతలు, స్టోరీబోర్డ్ కళాకారులు, యానిమేటర్స్ లాంటి) కూడా ఉంటాయి. ఒకప్పుడు మనుషులు మాత్రమే చెప్పే కథలను నేడు ఏఐ విప్లవంతో ఆసక్తికరంగా, ఆకర్షణీయంగా చెప్పడం చూస్తున్నాం. సాంకేతికత, సృజనాత్మకత కలయికతో ఏఐ తన పరిధిని విస్తరిస్తోంది. ఇది మరింత గొప్ప, వైవిధ్యమైన కథనాలకు దారి తీస్తున్నది.

తల్లితండ్రులు, పెద్దలు తమ డిజిటల్ ప్రపంచపు నీలి తెరల్లోంచి కొంత సమయం తీసుకొని తమ పిల్లలకు కథలు చెప్పడానికి వెచ్చించాలి. పిల్లల్లో వినే కళను కూడా పెంచండి. నేటి పెద్దలు కొంత వరకు తమ పిల్లలకు కథలు చెప్పడం నేర్చుకోవాలి. కథలను వింటూ ఎదిగిన పిల్లల వ్యక్తిత్వం ఇతర పిల్లల కన్న విలక్షణంగా ఉంటుందని గమనించాలి.

**(27 ఏప్రిల్ జాతీయ కథలు చెప్పే దినోత్సవం సందర్భంగా)**

**- డా. బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

# మనను నిలబెట్టేది మన బుద్ధి మాత్రమే



బుద్ధి బలం కంటే మించిన సంపద ఈ ప్రపంచంలో ఏదీ లేదు. బుద్ధి బలాన్ని సక్రమంగా ఉపయోగించాలి. తన తప్పులను ఎదుటి వారిపై నెట్టేసి, ఇతరులను ప్రమాదం లోకి పడేసే కుయుక్తులను మేథస్సు అనలేం. స్వార్థం, సంకుచితత్వంతో కూడిన అతి తెలివి తేటలు అనర్థానికి హేతువులు. అవసరానికి వాడుకుని వదిలేసే ప్రబుద్ధుల బుద్ధులు కడకు స్వీయ పతనానికే దారితీస్తాయి.బుద్ధి క్షీణిస్తే పతనం కూడా ప్రారంభమవుతుంది. అదృష్టం అందలం ఎక్కిస్తే,బుద్ధి బురదలోకి జారినట్టు మనముందున్న అవకాశాలను వదిలేసి, మూర్ఖంగా ఏదో సాధించాలని తపించడం అవివేకం. మేథస్సు మానవాళి శ్రేయస్సుకు వినియోగపడాలి. సమాజ హితానికి వినియోగ పడని జ్ఞానం వలన ఫలితం శూన్యం.గ్రంథపఠనం వలన,స్వీయ అనుభవాల వలన, జీవితం నేర్పిన పాఠాల వలన జ్ఞానం



అలవడుతుంది. జ్ఞాన సంపదను స్వీయ ప్రయోజనాల కోసం కాకుండా దేశ హితం కోసం వినియోగించాలి.ఆలోచనల నుండి ఆర్థిక జ్ఞానం అలవడాలి. జ్ఞానం అనేది సాధన వలన లభిస్తుంది. మన మస్తిష్కాన్ని, మనసును ఒక చోట కేంద్రీకరించి, పట్టుదలతో ప్రయత్నిస్తే, జ్ఞానం మన స్వంతమవుతుంది. ఎలాంటి ప్రయత్నం లేకుండా బుద్ధి వికసించదు.మానసిక పరిపక్వత సాధ్యం కాదు. ఈ ప్రపంచంలో జ్ఞానానికి సరితూగే ధనం లేనే లేదు. మేథస్సు మానవులకు లభించిన ఒక వరం.

ఇతర జీవరాశుల కంటే విభిన్నంగా జీవించాలనే తత్వం, ఆలోచన, విషయసేకరణ, ఆచరణ వంటి విశిష్ఠమైన లక్షణాలు మానవ జాతిలో మెండుగా ఉన్నాయి. ఇతర జీవరాశులకు తెలివి తేటలు లేవు అనుకోవడం కూడా అజ్ఞానం వలన జనించిన భావన మాత్రమే. మనతో మమేకమై జీవించే కోటాను కోట్ల జీవరాశులలో అద్భుతమైన తెలివి తేటలున్నాయి. సాలె పురుగు క్షణాల్లో నిర్మించుకునే ఒక రక్షణ వలయం ఒక అద్భుతమైన ఇంజనీరింగ్ నైపుణ్యాన్ని సూచిస్తుంది. ఇంతటి విచిత్ర మైన సాలె పురుగు రక్షణ నిర్మాణం మానవులకు కూడా సాధ్యం కాని విషయం. పక్షి తన నివాసానికి ఏర్పరచుకునే గూడును ఒక సారి పరిశీలిస్తే ఆ పక్షి యొక్క తెలివి తేటలు, పనితనం అవగతమవుతాయి. వివిధ రకాల జంతువులు తమను తాము ఇతర బలమైన జంతువుల నుండి కాపాడు కోవడానికి, ఆహారం కోసం ఎన్నో వ్యూహాలను సిద్ధం చేసుకుంటాయి. మొక్కలకు కూడా ప్రాణం,స్పందించే గుణం ఉందన్న విషయం భారతీయ శాస్త్రవేత్త జగదీష్ చంద్రబోస్ ఏనాడో నిరూపించాడు. తమకు ఆపద వస్తుందనుకున్న సమయంలో కొన్ని కొన్ని జాతుల మొక్కలు తమ రక్షణ వ్యూహాలను అమలు చేస్తాయి. పాములు, తేళ్ళు, తాబేళ్ళు వంటి జీవులు ఆపద సమయంలో ఎలా తమను తాము కాపాడు కోవడానికి ప్రయత్నిస్తాయో మనకు విదితమే. అయితే జీవరాశులన్నీ తమ మనుగడ కోసం ఎంత వరకు అవసరమో,అంత వరకే తమ శత్రువుల పట్ల జాగరూకత వహిస్తాయి. పశుపక్ష్యాదుల్లో లేని అవలక్షణం మనిషిలో స్వార్థం,అసూయ రూపంలో ఏర్పడడం మానవ మేథస్సుకు పట్టిన దరిద్రం. అవసరం లేకపోయినా దురాశతో తోటి మానవులను పీడించుకు తినడం, భూప్రపంచం ఉన్నంత వరకు బ్రతికేయాలనే దుగ్ధతో తరతరాలకు తరగని సంపదను కూడ బెట్టే ఒక అనైతిక ప్రక్రియలో భాగంగా స్వజాతి పట్ల అత్యంత దారుణంగా ప్రవర్తించడం మానవ మేథస్సుకు పట్టిన గ్రహణం.ఈ ధోరణి మారాలి. మన ఆలోచనలు, ప్రతిభ వ్యక్తిగత గుర్తింపుకు,గౌరవానికి తోడ్పడంలో ఎలాంటి తప్పు లేదు. అంతిమ ఫలితం మాత్రం సమాజానికి ఉపయోగపడాలి. అయితే ఒకరి ఆలోచనలను, ప్రతిభను మరొకరు బలవంతంగా లాక్కునే గత కాలం పద్ధతి మారాలి. మేథో మధన ఫలాలు ప్రపంచాన్ని ఆర్థికంగా ముందుకు తీసుకు రావాలి.మానవ మస్తిష్కంలో ఏర్పడిన ఆలోచనలకు,ఆసక్తికి సాధన తోడైతే దానికి ప్రయోగాత్మక పరిశీలనా దృక్పథం రంగరిస్తే వెలువడిన అమూల్యమైన సంపద జ్ఞానం. అలాంటి జ్ఞానం ఎన్నో మలుపులు తిరిగి,ఎన్నో అధ్యయనాలకు దారితీసి, ఎంతో మంది మేథావుల మస్తిష్కాలకు పదును పెడితే, ఎన్నో చర్చలు మేథో మధనం తర్వాత ఒక మహత్తరమైన ఆవిష్కరణకు రూపకల్పన జరుగుతుంది. అది ప్రపంచానికి,దేశానికి ఎంతో ఉపయుక్తకరమైన అంశంగా రూపం సంతరించుకుంటుంది. ఒక సకారాత్మక దృక్పథంతో కార్యసాధన చేస్తే, మానవ మేథస్సు ఒక అద్భుతమైన ఉత్పత్తిని సమాజానికి అందిస్తే అదే నిజమైన ఆస్తి. అదే ప్రపంచానికి నిజమైన వారసత్వ సంపద. జ్ఞానం నుండి వెలువడ్డ ఇలాంటి సంపదను మేథో సంపదగా అభివర్ణించవచ్చు. పూర్వకాలంలో తెలివితేటలను కొంతమందికే పరిమితం చేసేవారు. మేథావులు తమ తెలివి తేటలను ఇతరులకు పంచే వారు కాదు. కేవలం తమ కుటుంటాలకే పరిమితం చేసేవారు. కొంత మంది తెలివితేటలను ఈ సమాజం బలవంతంగా అణచివేసి ఆనందించింది.ఇలాంటి అసూయ వలన అనర్థాలే తప్ప సమాజానికి మేలు జరగలేదు.

ఈ సత్యాన్ని గ్రహించి పలు దేశాలు తమ ప్రజల ఆలోచనలను,తెలివి తేటలను చాలా తెలివిగా వినియోగించుకుని, ఇతర దేశాల మేథస్సును కూడా దొంగిలించి, అది తమ దేశాల గొప్పతనం గా ప్రచారం సాగించడం చూశాం. ఇలాంటి క్రమంలోనే భారత దేశం తమ విలువైన మేథాసంపత్తిని విదేశాలకు ధరాదత్తం చేసింది. తెరవెనుక తతంగాన్ని గుర్తించలేక, తమ మేథాసంపత్తిని బాహ్య ప్రపంచానికి తెలపడంలో విఫలమైనది. మేథో సంపత్తి హక్కుల పేరుతో భారతీయ మేథస్సు చౌర్యానికి గురైనది. భారతీయ సాంప్రదాయాల్లో నిక్షిప్తమైన అనేక శాస్త్రీయ ఆలోచనలు మూఢ నమ్మకాల ముసుగులో మూలన పడిపోతే, వాటిని తెలివిగా ఒడిసి పట్టుకుని పేటెంట్ హక్కులు సంపాదించి, వాటి ఫలితాలను తిరిగి ప్రపంచ దేశాలకు అమ్ముకుని, ఆర్థికంగా ఎదుగుతున్న దేశాలను చూసి చేష్టలుడిగి నిలబడ్డ అసహాయత చాలా కాలం కొనసాగింది.మన దేశంలో ఎంతో మంది శాస్త్రవేత్తలు తమ పరిశోధనలతో ప్రపంచాన్ని అబ్బుర పరిచారు. కాని వారి కృషికి తగిన గుర్తింపు లభించలేదు. ప్రాచీన నాగరికతకు పుట్టినిల్లు భారతదేశం. సైన్స్ అంటే ప్రపంచానికి తెలియని రోజుల్లో చరకుడు,సుశృతుడు వైద్య శాస్త్ర రంగంలో అనేక ఫలితాలను ప్రపంచానికి అందించారు. క్రీ.పూర్వమే సుశృతుడు తొలి శస్త్ర చికిత్స చేసి ఆశ్చర్య పరిచాడు. ఆయన అద్వితీయమైన వైద్య పరిజ్ఞానానికి గౌరవంగా మెల్ బోర్న్ లో సుశృతుని విగ్రహం నెలకొల్పబడింది. కాని మన దేశంలో వారికి లభించిన గౌరవం ఏమిటి? కనీసం వారి పేరైనా నేటి భారతీయ యువతకు, విద్యావంతులకు తెలుసా? భారతీయ సంప్రదాయంలో చర్మ సౌందర్యానికి వినియోగించే పసుపుకు సైతం విదేశీయులు పేటెంట్ హక్కులు పొంది, భారతదేశ జ్ఞానాన్ని తస్కరించారు. ప్రపంచ గణిత మేథావులకు సైతం అర్థం కాని మహా గణిత మేథావి శ్రీనివాస రామానుజన్ కు ఎందుకు నోబెల్ బహుమతి దక్కలేదు? మన దేశానికి చెందిన గణిత మేథావిని కనీసం ఆయన మరణానంతరం కూడా మనం భారతరత్న అవార్డునిచ్చి ఎందుకు సత్కరించలేక పోయామో అర్థం కావడం లేదు.ప్రపంచంలోని మేథావులను, వారి ఆవిష్కరణలను గుర్తించడం, వారి పరిశోధనా ఫలితాలకు పేటెంట్ హక్కులకు నివ్వడం ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న ప్రక్రియ.వ్యాపారాభివృద్ధికి,నాణ్యతకు వివిధ రకాల ట్రేడ్ మార్క్ లను ప్రకటించడం, పేటెంట్, కాపీ రైట్ చట్టాల పట్ల అవగాహన కలిగించడానికి ప్రతీ ఏటా ఏప్రిల్ 26 వ తేదీన ప్రపంచ మేథో సంపత్తి దినోత్సవం జరుపుకుంటున్నాం. వరల్ ఇంటిలెక్చ్యువల్ ప్రోపర్టీ ఆర్గనైజేషన్,' గిప్కో' 1970 వ సంవత్సరంలో తమ కార్యకలాపాలను ప్రారంభించింది. స్విట్జర్లాండ్ లోని జెనీవాలో డబ్ల్యు.ఐ.పి.ఓ. ప్రధాన కార్యాలయం నెలకొల్పబడింది. మేథా సంపత్తికి సంబంధించిన విలువను చాటి చెప్పి, దాని విధానాలను వివరించడం, సేవలను, సహకారాన్ని అందించాలనే సదుద్దేశ్యంతో నెలకొల్పిన ఈ అంతర్జాతీయ సంస్థ మేథావుల ఆలోచనలను ఆర్థిక రూపంలోకి మార్చి,తద్వారా ప్రపంచంలోని ప్రజలకు ఉపకరించే విధంగా ఆర్థిక నిర్మాణానికి సరికొత్త రూపకల్పన చేయాలి. ఒకరు సాధించిన విజయాలను మరొకరి ఖాతాలో జమ చేసుకోవడం మేథస్సుకు జరుగుతున్న అన్యాయం.

**- సుంకవల్లి సత్తిరాజు**
9704903463

## తెల్లారని కాశ్మీర్

మనిషినే
మనిషి చంపేది
ఘోర దుర్మార్గం
అది మతం కాదు
అది కులం కాదు
అది ఒక ఉన్మాదం
దేశం పేర
రాష్ట్రం పేర
ప్రాంతంపేర
కులమతాల పేర కభళించాలనే
ముష్కరుల దుశ్చర్యలు

భూతల స్వర్గం
కాశ్మీరం రక్తసిక్తం
కుంకుమపూల మనుషులు
ముష్కరుల కాల్పులకు
విగతజీవులు
నర నిర్మూలనోన్మాదం

మనుషుల్ని మాయంచేసి
మీరు సాధించేదేమిటి
ఆధునిక ప్రజాస్వామ్యంలో
అన్నింటికీ ఒక పద్ధతి ఉంటుంది
దుర్మార్గాలకు పద్ధతులు లేవు

గులాబీలు విరబూసే తోటలో
ఉగ్రవాదానికి అంతం లేదా
మంచుకొండల్లో
ఇనుడు రక్తవర్ణం దాల్చాడు

కార్గిల్ ,లద్దాఖ్
కాందహార్,సియాచిన్
పుల్వామ,పహల్గాం

దేశమంటే
తుపాకుల మోతలేనా
శవాల దిబ్బలేనా
మారణహోమాలేనా?
ఎన్నడు తెల్లారుతుందో ఈ దుర్మార్గం

ఆపిల్ పండ్లు
రక్తపు ముద్దలైనవి
దేవదారులు
మీ చర్యలకు నేలకొరిగినయి
కాశ్మీర జీవనం
రుధిర రహిత నేలకై వలసెల్లిపోతున్నయి
దేశభక్తింటే
ఉగ్రవాదమేనా



మతమంటే
ఆక్రమిత ఉన్మాదమేనా
లోయలు కొండలు
తీవ్ర అలజడులు

వసంతకేళీలు
రక్తపు హోళీలు

**- వనపట్ల సుబ్బయ్య**
9492765358

# వ్యవసాయానికి జీవ నాడులు





భారతదేశం వ్యవసాయ ఆధారిత దేశం. దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం కీలకమైన పాత్ర పోషిస్తుంది. కానీ గత కొన్ని దశాబ్దాలుగా హరిత విప్లవం తరువాత హైబ్రిడ్ వంగడాల రాకతో అధిక దిగుబడుల ఆశతో రైతులు పరిమితికి మించి రసాయన ఎరువులను వాడడం మొదలు పెట్టారు ఆధారపడటం మొదలుపెట్టారు.

దీని వల్ల తాత్కాలికంగా దిగుబడుల పెరిగినా నేల సారవంతత సహజ ఉత్పాదకత తగ్గిపోయింది. మట్టిలో జీవకణాలు తగ్గుతూ అవి జరిపే రసాయన చర్యలపై గణనీయంగా మార్పులు వచ్చాయి తద్వారా భూమి సజీవ శక్తిని కోల్పోతూ వస్తుంది మళ్ళీ దీనిని పునరుద్ధరించాలంటే రసాయన వ్యవసాయం తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలి సేంద్రియ వ్యవసాయంలో జీవన ఎరువుల పాత్ర చాలా ప్రముఖమైనది..

జీవ ఎరువులు అంటే ఏమిటి?.... జీవ ఎరువులు అనేవి సూక్ష్మజీవుల ఆధారంగా తయారవుతాయి. ఇవి మట్టిలో జీవకణాల వృద్ధికి దోహదపడతాయి. మొక్కలకు అవసరమైన పోషకాల్ని సహజంగా అందిస్తాయి. రసాయనాల వాడకాన్ని తగ్గిస్తాయి. ఇవి ముఖ్యంగా బ్యాక్టీరియా, ఫంగస్, ఆల్గే వంటి జీవులతో తయారవుతాయి.

**నత్రజని స్థిరీకరణ సూక్ష్మజీవులు:** అజోస్పిరిల్లం, అజటోబాక్టర్, రైజోబియం వంటివి వాతావరణంలోని నత్రజనిని మట్టిలోకి మలచి మొక్కలకు అందిస్తాయి.

**ఫాస్ఫరస్ మొబిలైజింగ్ సూక్ష్మజీవులు:** ఫాస్ఫోబాక్టీరియా, బ్యసిల్లస్ మెగాటీరియమ్ వంటివి అందుబాటులో లేని ఫాస్ఫరస్ను మొక్కలు గ్రహించగలిగే రూపంలోకి మార్చుతాయి.

**పొటాష్ మొబిలైజింగ్ బ్యాక్టీరియా:** మట్టిలో ఉన్న పొటాష్ను మొక్కలు గ్రహించేందుకు సహాయపడతాయి.

**మైకోరైజా:** మొక్కల వేర్లతో సహజీవనం చేస్తూ, పోషకాలను గ్రహించే సామర్థ్యాన్ని పెంచుతుంది. వేర్ల చుట్టూ రక్షణ పొరను ఏర్పరచి, మట్టి ద్వారా వచ్చే వ్యాధులను అడ్డుకుంటుంది.

**మిశ్రమ జీవ ఎరువులు:** విభిన్న సూక్ష్మజీవాలను కలిపి తయారుచేసే మిశ్రమం ఇవి మల్టీ ఫంక్షనల్గా పనిచేస్తాయి. విత్తన శుద్ధిలో, వేరు ముంచడంలో, నీటితో కలిపి డ్రిప్ ద్వారా ఈ జీవ ఎరువులను వాడవచ్చు.

**ఇతర ముఖ్యమైన జీవ ఉత్పత్తులు**

**జీవ శిలీంద్ర నాశకాలు:** ట్రైకోడెర్మా విరిడీ, సుడోమోనాస్ ఫ్లోరోసెన్స్ - శిలీంద్ర వ్యాధులను అరికడతాయి.

**జీవ బ్యాక్టీరియా నాశకాలు:** బాసిల్లస్, స్ట్రెప్టోమైసీస్-బ్యాక్టీరియాల వల్ల వచ్చే వ్యాధులపై ప్రభావవంతంగా పనిచేస్తాయి.

**జీవ పురుగుమందులు :** బవేరియా, మెటారిజం, వెర్టిసెలియం, వేప ఆధారిత ఉత్పత్తులు, జీవ సూది పురుగు నియంత్రకాలు (బయో నెమటోసైడ్స్) పాసిలోమైసిస్ - వేర్లపై దాడి చేసే సూదిపురుగుల నివారణకు.

జీవ కలుపు మందులు (బయో హెర్బిసైడ్స్)

కొలటుట్రైకం - కలుపు మొక్కల నియంత్రణకు (ఇప్పటికీ పరిశోధన దశలో ఉంది).

**మొక్కల వృద్ధికి సహాయ పడే జీవులు :**

అజోస్పిరిల్లం, బాసిల్లస్ - వేరు అభివృద్ధికి, వృద్ధికి సహకరిస్తాయి.

జీవ వృద్ధి ప్రేరకాలు (బయో స్టిములెంట్స్)

సముద్రపు నాచు, హ్యూమిక్ యాసిడ్ - పూత, ఫలాల పరిపక్వతను వేగవంతం చేస్తాయి.

జీవ వికర్షకాలు (బయో రెప్పలెంట్స్ )

నీమ్ ఆయిల్, వెల్లులి మిశ్రమం - పురుగులను దూరంగా ఉంచుతాయి.

**జీవ ఉత్పత్తుల ప్రయోజనాలు:**

జీవకణాల పెరుగుదల ద్వారా మట్టిని సారవంతంగా మార్చుతాయి.

మొక్కలకు పోషకాల లభ్యత పెరుగుతుంది: నత్రజని, ఫాస్ఫరస్, పొటాష్ వంటి మూలికలను మొక్కలు బాగా గ్రహిస్తాయి.

**వేర్ల అభివృద్ధి మెరుగవుతుంది :** వేర్ల పొడవు, వ్యాప్తి పెరిగి మొక్కల స్థిరత్వం పెరుగుతుంది.

వ్యవసాయ వ్యయం తగ్గుతుంది: రసాయన ఎరువుల ఖర్చు తగ్గి, రైతుకు ఆదాయం పెరుగుతుంది.

**పర్యావరణ హితం :** మట్టి, నీరు, గాలి కలుషితం చేయవు. ప్రకృతిని కాపాడతాయి.

సేంద్రియ వ్యవసాయానికి మౌలికం: జీవ ఎరువుల్లేకుండా సేంద్రియ వ్యవసాయం సాధ్యం కాదు. జీవ ఎరువులు రైతు భవిష్యత్తుకు వెలకట్టలేని పెట్టుబడి. ఇవి భూమికి జీవం, పంటలకు పోషణ, రైతుకు లాభం, సమాజానికి ఆరోగ్యకరమైన ఆహారం అందించే మార్గం. రైతులు ప్రకృతితో సమన్వయంగా సాగు చేయాలంటే, జీవ ఉత్పత్తులు మార్గదర్శకంగా నిలుస్తాయి

సారవంతమైన భూమి - సమృద్ధిగా పంట - ఆరోగ్యకర సమాజం అనే లక్ష్యంతో ప్రతి రైతు జీవ ఉత్పత్తులను పంటలకు వాడాలి.

జీవన ఎరువులే రైతుల జీవితాలలో వెలుగులు నింపే వనరులు. మట్టిలోజీవం వుంటేనే మనిషికి జీవితం వుంటుంది

**- జి. అజయ్ కుమార్**

## కిషన్ రావు కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



రంగారెడ్డి ఏప్రిల్ 26 (మనం న్యూస్): ఆర్కే పురం డివిజన్ జనప్రియ కాలనీకి చెందిన కిషన్ రావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న మాజీ మంత్రి , మహేశ్వరం శాసన సభ్యురాలు పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి శనివారము ఆయన పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబాన్ని ఓదార్చారు. పరామర్శించిన వారిలో నియోజకవర్గ బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, గొడుగు శ్రీనివాస్, సాజిద్, శ్యాం గుప్తా , కొండ్ర శ్రీనివాస్, భూపాల్ రెడ్డి,పటేల్ సునీత రెడ్డి, మహేందర్ రెడ్డి, ఊర్మిళ రెడ్డి, జగన్, జాహీద్ ,మురళీధర్ రెడ్డి లు ఉన్నారు.

# మహిళల పక్షపాతి ఎన్డీఏ ప్రభుత్వం

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు




తిరుపతి, ఏప్రిల్ 26 మనం న్యూస్ :మహిళల సాధికారత కోసం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. మహిళలకు ఇచ్చిన ప్రతి హామిని ప్రభుత్వం నెరవేరుస్తుందని ఆయన తెలిపారు. ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని సిఎన్ సి సెంటర్ లో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శనివారం ఉదయం ప్రారంభించారు. బిసి కార్పోరేషన్, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్ శిక్షణను ప్రభుత్వం అందిస్తోంది. తొంబై రోజుల పాటు జరిగే ఈ శిక్షణకు 360మంది మహిళలు ఎంపికైయ్యారు. మహిళలు ఆర్థికంగా నిలబడేందుకు అవసరమైన అన్ని చర్యలను ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తీసుకుంటోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. కుట్టుమిషన్ నేర్చుకోవడం ద్వారా మహిళలు తమ కాళ్ళపై తాము నిలబడేందుకు వీలుకలుగుతుందని ఆయన చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలకు సమాన ప్రాతిపదికన కుట్టు మిషన్ శిక్షణకు మహిళలను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. మహిళలకు ఏడాదికి మూడు ఉచిత సిలిండర్స్ ను అందిస్తోందని ఆయన చెప్పారు. అలాగే తల్లికి వందనాన్ని పాఠశాలలు తెరిచే నాటికి అమలు చేస్తుందని ఆయన తెలిపారు. మహిళ సంక్షేమానికి ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు నెరువేరుస్తారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ శాఖ ఈడి శ్రీదేవి, యాదవ కార్పోరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, నాయిబ్రాహ్మణ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, డిప్యూటీ మేయర్స్ ముద్ర నారాయణ, ఆర్సీ మునికృష్ణ, కార్పొరేటర్ ఎస్ కే బాబు, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, తదితరులు పాల్గొన్నారు.



## స్వచ్ఛాంధ్ర పైలెట్ ప్రాజెక్టుగా రాళ్ళబూదుగూరు గ్రామ పంచాయతీ

శాంతిపురం, ఏప్రిల్ 26 మనం న్యూస్ః రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గము పరిధిలోని శాంతీపురం మండలములోని అన్ని గ్రామాలను చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుటలో భాగముగా శాంతీపురం మండలములోని రాళ్ళబూదుగూరు గ్రామ పంచాయతీని పైలెక్టు ప్రాజెక్టుగా ఎంపిక చేసి ప్రభుత్వము ద్వారా ఎలక్ట్రికల్ ఆటో ను చెత్తసేకరణ కోసం కేటాయించడమైనదని ఎంపీడీవో తెలిపారు. దీని ద్వారా ఇంటింటి చెత్త సేకరణ సంభందిత పనులు మరియు త్వరగా పని పూర్తి చేయుటకు వీలు కలుగుతుంది. మొదటగా ఎలక్ట్రికల్ ఆటో సేవలను రాళ్ళబూదుగూరు గ్రామ పంచాయతీ నందు వినియోగించి ఎలక్ట్రికల్ ఆటో ఉపయోగాలను మరియు ఎవైనా మార్పులు చేయవలసివుంటే పై అధికారులకు తెలియజేయవలసి వుంది. దీని ద్వారా అన్ని గ్రామ పంచాయతీలకు ఎలక్ట్రికల్ ఆటో లను సరఫరా చేసి శాంతీపురం మండలములోని అన్ని గ్రామాలు పరిశుభ్రమైన గ్రామాలుగా మార్పు చెందుతాయని శాంతీపురం మండల ఎంపీడీవో ఏపీ ఆర్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓ పిఆర్ఢి రవినాయక్, పంచాయతీ కార్యదర్శి స్వాతి, స్థానిక సర్పంచు లక్ష్మీ మురుగేష్, స్థానిక ప్రజాప్రతినిధులు ఆర్ ఎస్ మణి, జయరాజు, వాజిద్, గోపి మరియు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## వరంగల్ లో జరిగే రజథోత్సవ సభ ను విజయవంతం చేయాలి




భీంగల్ ,ఏప్రిల్ 26 (మనం న్యూస్)ః బీఆర్ఎస్ పార్టీ రథోత్సవ 25 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ వరంగల్లో నిర్వహిస్తున్న రజతోత్సవ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ఆదేశానుసారం. భీంగల్ మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. భీంగల్ మండలం మరియు పట్టణం నుండి 14 బస్సుల్లో 700 మంది పార్టీ నాయకులు కార్యకర్తలను తరలించాలని ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఆదివారం ఉదయం 9:00 గంటలలోపు ప్రతి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించి ప్రతి కార్యకర్త బస్సుల్లోనే బహిరంగ సభకు తరలిరావాలని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు దొనకంటి నర్సయ్య, మాజీ ఎంపీపీ ఆర్మూర్ మహేష్, మాజీ జెడ్పిటిసి చౌటుపల్లి రవి, మాజీ జడ్పి కోఆప్షన్ ఎంఎ మోయిజ్, సొసైటీ చైర్మన్ శివసారి నర్సయ్య ,శర్మ నాయక్, తూకాజీ నాయక్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ భగత్, కౌన్సిలర్లు బొదిరె నరసయ్య, మూత లింబాద్రి ,మల్లెల ప్రసాద్, సతీష్ గౌడ్, లింగం నాయక్, ఎంఎ రజాక్, పర్సన్ నవీన్, తుమ్మ ముత్తెన్న మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాశ్మీర్ హత్యాకాండ పై న్యాయవాదుల నిరసన ర్యాలీ

రాయచోటి ఏప్రిల్ 26 మనం న్యూస్: కాశ్మీర్ లోని రహల్గాం లో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దారుణ హత్యకాండకు నిరసనగా రాయచోటి బార్ సోసియేషన్ న్యాయవాదుల ఆధ్వర్యంలో శనివారం ఉదయం రాయచోటి పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు ర్యాలీ రాయచోటి కోర్టు నుండి న్యాయవాదులు ప్రజా ప్రజాసంఘాలు న్యాయవాద గుమస్తాలు కలిసి రాయచోటి ఎమ్మార్వో కార్యాలయం పాత బస్టాండు నేతాజీ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు పర్యాటకులను హతమార్చిన ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని భారతీయుల ఐక్యతను చాటాలని పాకిస్తాన్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు సామాన్యులు ఉగ్రవాదుల తూటాలకు బలికాకుండా కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని వారు నినాదాలు చేశారు ఈ కార్యక్రమంలో రాయచోటి బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్. ప్రభాకర్ రెడ్డి ప్రధాన కార్యదర్శి రెడ్డి భాష భారత న్యాయవాదుల సంఘం ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టీ. ఈశ్వర్ ఎమ్మార్పీఎస్ నాయకులు రామాంజనేయులు రజక సంఘం నాయకులు రమేష్ శ్రీనివాసులు రమణ రైతు సంఘం నాయకుడు రంగారెడ్డి నాయి బ్రాహ్మణ సంఘం నాయకుడు రమణ న్యాయవాదులు టీవీ రమణ హ్యూమయున్ భాష రాజకుమారి చంద్రిక వరలక్ష్మి కుశనుమ,నాగముని ఖాదర్బాషా జనార్దన్ రెడ్డి నిరంజన్ చిన్నయ్య వీరభద్ర రామాంజనేయులు సయ్యద్ బాషా హిదయతుల్ల యతుల్ల అజంతుల్లా గంప సుబ్బరాయుడు వెంకటరమణమూర్తి దేవేందర్ రెడ్డి శివకుమార్ కేఈటివి రమణ న్యాయవాద గుమస్తాల సంఘం అధ్యక్షుడు సుబ్బరామయ్య రాజా రామకృష్ణ, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.




## అష్టలక్ష్మీ దేవాలయం 29వ(ఏకోనత్రింశత్) ఇష్టి సహిత బ్రహ్మోత్సవములు



రంగారెడ్డి ఏప్రిల్ 26 (మనం న్యూస్) మహేశ్వరం నియోజకవర్గం ఆర్కె పురం డివిజన్ పరిధిలోని వాసవి కాలనీలోని అష్టలక్ష్మీ దేవాలయంలో 29వ(ఏకోనత్రింశత్) ఇష్టి సహిత బ్రహ్మోత్సవముల ను ఈ నెల28 సోమవారం నుండి 4 వ తేది ఆదివారం వరకు కన్నుల పండుగగా అంగరంగ వైభవంగా వాహనోత్సవములు, సంకీర్తనలు, కోలాటాలు, నృత్యాలతో ఎంతో వైభవముగా నిర్వహించబడునని దేవాలయ ఛైర్మెన్ సోమ సురేష్ తెలిపారు. 28 సోమవారం రోజున తిరుచ్చిపల్లకి సేవ, 29 మంగళవారం రోజున శ్రీ లక్ష్మీనారాయణ ఇష్టి హవనము, హంసవాహనసేవ, 30 బుధవారం రోజున నృసింహ ఇష్టి, సూర్య ప్రభ వాహనసేవ, గజవాహన సేవ, చంద్రప్రభ వాహన సేవ, ఎదురుకోలు ఉత్సవం, 1 గురువారం రోజున హయగ్రీవ ఇష్టి, హనుమత్ వాహనసేవ, గరుడవాహన సేవ,శ్రీ లక్ష్మీనారాయణ కళ్యాణమహోత్సవం, దీపోత్సవము, అశ్వవాహన సేవ, 02 శుక్రవారం రోజున వరాహ ఇష్టి, సింహ వాహన, రథోత్సవము. 03 శనివారం రోజున సుదర్శన ఇష్టి, కల్పవృక్ష వాహన సేవ, మహా పూర్ణాహుతి.04 ఆదివారం రోజున అష్టోత్తర కలశాభిషేకము, చిన్న రథోత్సవము తదితర కార్యక్రమాలు నిర్వహించబడునని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫౌండర్ ఛైర్మన్ గౌరీశెట్టి చంద్ర శేఖర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్య, కమిటీ సభ్యులు శ్రీనివాసు, గౌరీశెట్టి అరుణ్ కుమార్, చిలుక ఉపేందర్ రెడ్డి, ఉమాపతిరావు, సుదర్శన్, గ్రంధి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# జడ్సన్ యూనివర్సిటీలో స్పాట్ అడ్మిషన్స్ ప్రారంభం



రంగారెడ్డి, ఏప్రిల్ 26 (మనం న్యూస్)ః ఉన్నత విద్య,గ్లోబల్ కేర్ అవకాశాల కోసం ప్రయత్నిస్తున్న విద్యార్థుల కోసం అమెరికాలోని జడ్సన్ యూనివర్సిటీ 2025 గాను స్పాట్ అడ్మిషన్స్ అవకాశం కల్పిస్తుందని జడ్సన్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ డా. నిక్కి ఫెనర్ను తెలిపారు. శుక్రవారం చైతన్యపురి లోని కెరిర్ వింగ్స్ కన్సల్టెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంకు ఆమె హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ అంతర్జాతీయ ఎడ్యుకేషనల్ కన్సల్టింగ్ లో లీడింగ్ లో ఉన్న కెరీర్ ఎడ్యు గ్రూప్ ఈ ఏడాది యునైటెడ్ స్టేట్స్ లో చదువుకోవాలని విద్యార్థుల కోసం అద్భుతమైన అవకాశాన్ని కల్పిస్తుందన్నారు. అమెరికాకు చెందిన జడ్సన్ యూనివర్సిటీతో అనుసంధానమై స్పాట్ అడ్మిషన్స్ ఈవెంట్ ను ఏప్రిల్ 26న హిమాయత్ నగర్ లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్టెమ్ ఫోకస్డ్ మాస్టర్స్, డాక్టోరియల్ ప్రోగ్రామ్లో స్పాట్ అడ్మిషన్స్ పొందవచ్చు అన్నారు. అప్లికేషన్ ఫీజు లేకుండా, ఐ20 డిపాజిట్స్ కూడా ఉండవన్నారు. 24 గంటల్లో యాక్సెప్టెన్స్, మూడు రోజుల్లో ఐ20 లభిస్తుంది అన్నారు. సీసీ ప్రెసిడెంట్ స్కాలర్షిప్ తో సహా 9200 స్కాలర్షిప్ లభిస్తుంది అన్నారు. ఎలాంటి సందేహాలున్న నేరుగా జడ్చర్ యూనివర్సిటీ అధికారుల్ని కలవచ్చు అన్నారు. జడ్చర్ నుంచి గ్రాడ్యుయేట్ అయిన వాళ్లకు డైరెక్ట్ క్యాంపస్ ప్లేస్మెంట్ అవకాశం కల్పిస్తుంది అన్నారు. స్టెమ్ ప్రోగ్రామ్స్ లో ఎమ్మెస్ కంప్యూటర్ సైన్స్, మాస్టర్ ఆఫ్ బిజినెస్ ఇన్ఫర్మేటిక్స్, డాక్టరేట్ ఇన్ కంప్యూటర్ సైన్స్ లు ఉంటాయి అని తెలిపారు. మరిన్ని వివరాలకు 9052000710, 7995866681 నెంబర్లలో సంప్రదించవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెరీర్ ఎడ్యుకేషన్ గ్రూప్ డైరెక్టర్ ఇర్ఫాన్ అహ్మద్,ఇంటర్నేషనల్ యూఎస్ఏ స్టూడెంట్ కౌన్సిలర్ నవ్య, మార్కెటింగ్ మేనేజర్ అబ్దుల్ సలాం తదితరులు పాల్గొన్నారు.

## అశ్వారావుపేటలో జాతీయ జెండాలతో భారీ ర్యాలీ

### పాకిస్థాన్ డౌన్ టౌన్ హిందుస్థాన్ జిందాబాద్ అంటూ దద్దరిల్లిన అశ్వారావుపేట



అశ్వారావుపేట, ఏప్రిల్ 26(మనం న్యూస్ ): జమ్మూ కాశ్మీర్లో పహల్గన్ లో జరిగిన ఉగ్రవాదుల కాల్పులకు నిరసనగా ఈ రోజు శనివారం రోజు అశ్వారావుపేట ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో అన్ని రకాల వ్యాపారస్తులు సంపూర్ణ బంద్ పాటించారు.అలాగే అశ్వారావుపేట లోని స్థానిక రింగ్ రోడ్ సెంటర్ నుండి 9.30 నిమిషాల నుండి ఛాంబర్ ఆఫ్ కామర్స్ లో అన్ని రకాల వ్యాపారస్తులు,మరియు కులమతాలకు అతీతంగా,అన్ని రాజకీయ పార్టీలు కాంగ్రెస్ బిఆర్ఎస్,బీజేపీ,టీడీపీ,సిపిఎం,సీపీఐ,జనసేన ,ఎంఎల్ పార్టీల ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో పాకిస్థాన్ డౌన్ డౌన్ హిందుస్థాన్ జిందాబాద్ పాకిస్థాన్ ఖబడ్డర్ అంటూ భారీగా నిరసన ర్యాలీ నిర్వహించరు. ఈ కార్యక్రమంలో అన్నీ పార్టీలా రాజకీయా నాయకులు వ్యాపారస్తులు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# భవిత సెంటర్లను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

- ప్రత్యేకావసరాలున్నపిల్లలకు ఏ ఇబ్బందులు రావద్దు
- కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి



కరీంనగర్, ఏప్రిల్ 26 (మనం బ్యూరో)ః ప్రత్యేక అవసరాలున్న పిల్లల కోసం ఏర్పాటు చేసిన భవిత సెంటర్లలో వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దేలా ఆధునీకరించాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక ముకరంపురంలోని భవిత సెంటర్ ను అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నగరంలోని భవిత సెంటర్ ను ఒక మోడల్ గా గ్రాండ్ లుక్ ఉండేలా తీర్చిదిద్దాలని సూచించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు భవిత సెంటర్లలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. పిల్లలు అన్ని రంగాల్లో రాణించేలా భవిత సెంటర్లు దోహదపడాలని, ఆ విధంగా వాటిని తయారు చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. భవిత సెంటర్లలో వాల్ పెయింటింగ్స్, ప్లే వే మెటీరియల్ ఏర్పాటు చేయడంతో పాటు చదువుకోవడానికి, క్రీడలకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని ఆమె సూచించారు. వారికి చదువుపై ఆసక్తి కలిగించేలా భవిత సెంటర్లను తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల్లో మానసిక ధైర్యం పెంపొందించేందుకు అన్ని విధాలా వారికి అధికారులు తోడు నీడగా ఉండాలని పమేలా తెలిపారు. పిల్లలను అన్ని రంగాల్లో ఉన్నతంగా తీర్చిదిద్దాలని, అందుకు భవిత సెంటర్ల సిబ్బంది నిరంతరం పాటుపడాలని సొంత బిడ్డల్లాగా వారిని చూసుకోవాలని సూచించారు. జిల్లాలోని 16 భవిత సెంటర్లను ఆధునీకరించే పనులు త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఆయా సెంటర్ల అభివృద్ధి కోసం తాము నిరంతరం ముందుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, నెహ్రూ యువ కేంద్ర కోఆర్డినేటర్ రాంబాబు, జిసి డివో కృపారాణి, ప్లానింగ్ కోఆర్డినేటర్ మిల్కురి శ్రీనివాస్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# బీసీలు అన్ని రంగాలలో ముందుండాలి



తిరుమలగిరి, ఏప్రిల్ 26 మనం న్యూస్ః తెలంగాణతో పాటు దేశంలో అత్యధిక జనాభా కలిగిన బీసీలు అన్ని రంగాల్లో ముందుండాలని బీసీ సంఘం రాష్ట్ర నాయకులు గుణగంటి చంద్రశేఖర్ గౌడ్, చుక్కల సత్యనారాయణ అన్నారు. శనివారం తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన నుండి నేటి వరకు బీసీలు అన్ని రంగాలలో అనిచి వేయబడ్డారని అన్నారు దేశాన్ని ఏలిన పాలకులు బీసీలను కేవలం రాజకీయ జెండాలు మోసే బోయిలుగా ఓటు బ్యాంకుగా వాడుకున్నారే తప్ప ఏలాంటి సంక్షేమ పథకాలతో పాటు విద్యా ఉద్యోగ రాజకీయ రంగాలలో ప్రాధాన్యత కల్పించలేదని అన్నారు. బీసీలకు విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో కులపరమైన రక్షణ కల్పించాలని అని కోరారు రాష్ట్రంలో కొండ లక్ష్మణ్ ప్ బాపూజీ, గౌతు లచ్చన్న, బొజ్జ నరసింహులు తదితర నాయకుల మూలంగానే 1966 లో కాసుబ్రహ్మానంద రెడ్డి ప్రభుత్వం బీసీలకు 20% విద్యా ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించింది కానీ ఆ తర్వాత రాష్ట్రస్థాయిలో అనంతరామన్ కమిషన్ మురళీధర్ రావు కమిషన్ నివేదిక బీసీల అభివృద్ధికి తోడ్పాడ్డా యని ఆయన అన్నారు రాజకీయ రంగంలో చూసుకుంటే 1980లో టి అంజయ్య ప్రభుత్వం బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 10 శాతం రిజర్వేషన్ కల్పించింది అని అన్నారు 1986లో ఎన్టీఆర్ ప్రభుత్వం బీసీలకు స్థానిక సంస్థల్లో 20% రిజర్వేషన్లు అమలు చేశారని అన్నారు దేశంలో 1993లో 73 74 రాజ్యాంగ సవరణ ద్వారా పీవీ నరసింహారావు ప్రభుత్వం బీసీలకు 33% రిజర్వేషన్ కల్పించింది చెప్పారు ఉద్యోగాల్లో మాదిరిగానే స్థానిక సంస్థల్లో మొత్తం త్ 50 శాతానికి మించరాదని డాక్టర్ కృష్ణమూర్తి సుప్రీంకోర్టులో 2010లో తీర్పు ఇచ్చిందని అన్నారు ఈ తీర్పు యావత్ బి సమాజానికి శాపంగా మారిందని ఆ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల్లో కేవలం 23 శాతం రిజర్వేషన్ మాత్రమే కల్పిస్తున్నారు. బీసీల హక్కుల సాధన కోసమే కటకం నరసింహారావు ఆధ్వర్యంలో మన ఆలోచన సాధన సమితి స్థాపించారని వారన్నారు మేధావులు బీసీలు అందరూ యువకులు యువకులు, విద్యార్థులు కలిసి రావాలని ఆయన కోరారు ఈ విలేకరుల సమావేశంలో సామాజిక తెలంగాణ మహాసభ రాష్ట్ర కన్వీనర్ కొత్తగట్టు మల్లయ్య, బీసీ సంఘం జిల్లా నాయకులు చేను శ్రీనివాస్, గిలకత్తుల రాము గౌడ్,, బీసీ సంఘం జిల్లా కార్యదర్శి వంగరి బ్రహ్మం, దేవులపల్లి గణేష్, మెతుకు నరసింహ, పాశం సత్యనారాయణ, చింతకాయల సుధాకర్, లోడే సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మన పాఠశాల రక్షణ మనందరి బాధ్యత




పెన్ పహాడ్, ఏప్రిల్ 26 (మనం న్యూస్)ః మన ప్రభుత్వ పాఠశాలల రక్షణ మనందరి బాధ్యతని ప్రధానోపాధ్యాయులు కే.ప్రభాకర్ అన్నారు శనివారం మండల పరిధిలోని గాజుల మల్కాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఎల్లప్పకుంట, సీతమ్మ తండా గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించి 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులను గాజుల మల్కాపురం పాఠశాలకు పంపించాలని ప్రచారం నిర్వహించి మాట్లాడారు ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని పాఠశాల విద్యాబోధన, మౌలికవసతులపై అవగాహన కల్పించి ఇంటి వద్దనే విద్యార్థుల అడ్మిషన్ చేశారు పాఠశాలలో ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, మధ్యాహ్న భోజనం సౌకర్యం, ఏకరూప దస్తులు, ఆహ్లాదకరమైన వాతావరణంలో నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు ఇంతకుముందు బడిబాట ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలోఉపాధ్యాయులు ఎరగాని లింగయ్య ,షేక్ ఉమర్ ,ముదిరెడ్డి వెంకట్ రెడ్డి, రాచూరి శ్రీనివాస్, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థిగా పాక్కు వెళ్లి.. ఉగ్రవాదిగా వచ్చిన ఆదిల్

**జమ్ము, ఏప్రిల్ 26:** పహల్గాం ఉగ్ర దాడిలో కీలక నిందితుడైన ఆదిల్ హుస్సేన్ థోకర్ గురించి కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. చదువుకోవాల్సిన వయసులో అతివాద భావజాలానికి ప్రేరేపితుడయ్యాడు. చదువు పేరుతో పొరుగుదేశమైన పాకిస్థాన్‌కు వెళ్లి ఉగ్రవాద శిక్షణ తీసుకున్నాడు. తిరిగొచ్చి సొంత గడ్డపైనే అకృత్యాలకు పాల్పడ్డాడు. పహల్గాంలో పర్యాటకులకు మరణ శాసనం రాసిన ఉగ్రవాది ఆదిల్ హుస్సేన్ థోకర్ ఉదంతమిది.

20 ఏళ్ల ఆదిల్ థోకర్‌ది అనంత్‌నాగ్ జిల్లాలోని బిజ్బెహారాకు సమీపంలోని గురీ అనే చిన్న గ్రామం. యుక్తవయసుసలో ఉండగానే పలు నిషేధిత ఉగ్ర సంస్థలకు చెందిన వారితో చాలా దగ్గరగా మెదిలాడు. 2018లో దక్షిణ కశ్మీర్‌లో జరిగిన ఓ ఉగ్రవాది అంతిమయాత్రలో పాల్గొన్నాడు. అదే ఏడాది పాక్ నుంచి విద్యార్థి వీసా సాధించి వాఘా సరిహద్దు దాటాడు. ఆ తర్వాత బాహ్య ప్రపంచానికి కన్పించకుండా పోయాడు. దాదాపు 8 నెలల పాటు కుటుంబంతోనూ మాట్లాడకుండా అజ్ఞాతంలో గడిపాడు. అతడిపై ఇంటలిజెన్స్ ఏజెన్సీలు నిఘా పెట్టినా ఏ ఫలితం లేకపోయింది. అయితే, ఆ సమయంలో అతడు లష్కరే తోయిబా సంస్థలో చేరినట్లు ఆ తర్వాత నిఘా వర్గాలు గుర్తించాయి. 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్'లో శిక్షణ తీసుకొని టాప్ కమాండర్ల పక్కన పని చేసినట్లు తెలిపాయి.



2024 చివరలో ఆదిల్ భారత్‌కు తిరిగొచ్చాడు. అయితే, అధికారిక మార్గాల్లో కాదు. పూంఛ్-రాజౌరీ సెక్టార్‌లోని నియంత్రణ రేఖను దాటి అక్రమంగా చొరబడ్డాడు. అతడి వెంట ముగ్గురు, నలుగురు పాక్ జాతీయులు కూడా వచ్చినట్లు నిఘా వర్గాల సమాచారం. ఈ సెక్టార్‌లో గుట్టలు, దట్టమైన అటవీ ప్రాంతం ఉండటంతో పెట్రోలింగ్ చేయడం కష్టమైనది. అది అనువుగా తీసుకుని ఆదిల్ ఆ సరిహద్దు గుండా దేశంలోకి ప్రవేశించినట్లు తెలుస్తోంది. అతడి వెంట ఉన్న వారిలో హషీమ్ ముసా అలియాస్ సులేమాన్ కూడా ఉన్నాడు. పహల్గాం దాడికి పాల్పడిన ఉగ్రవాదుల్లో సులేమాన్ కూడా ఒకడు.

సరిహద్దు నుంచి తన స్వస్థలానికి చేరుకొనే సమయంలోనూ ఆదిల్ నిఘా ఏజెన్సీలకు చిక్కకుండా చాలా జాగ్రత్త పడినట్లు తెలుస్తోంది. అనంతనాగ్‌లో అతడు అండర్‌గ్రౌండ్‌లో దాక్కొన్నట్లు భద్రతా బలగాలు గుర్తించాయి. ఆ సమయంలో ఓ పాక్ జాతీయుడికి కూడా ఆశ్రయం ఇచ్చాడు. కొన్ని వారాల పాటు స్థానిక టెర్రరిస్ట్ సెల్‌తో నిరంతరం సంప్రదింపులు జరిపి పహల్గాం దాడికి కుట్ర రచించినట్లు తెలిసింది. అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించేలా భారీ కుట్రకు ఆదిల్ ప్లాన్ చేసుకున్నట్లు అధికారులు భావిస్తున్నారు. ఇందుకోసం అనువైన ప్రదేశం కావాలని స్థానిక ఉగ్ర విభాగాలతో అతడు చర్చించినట్లు సమాచారం. తొలుత రద్దీగా ఉండే టూరిస్టు ప్రదేశాలను ఎంచుకోవాలని అనుకున్నాడు. అయితే, భద్రతా బలగాలకు సవాలుగా ఉండే బైసరన్ లోయ అయితే తప్పించుకునేందుకు వీలు ఎక్కువగా ఉంటుందని దాన్ని ఎంచుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఏప్రిల్ 22, మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఆదిల్ సహా కొంతమంది ఉగ్రవాదులు దట్టమైన పైన్ అడవులను దాటుకుని బైసరన్ పచ్చిక బయళ్లను చేరుకున్నారు. ఎం-4 రైఫిళ్లు, ఏకే 47 తుపాకులతో పర్యాటకులను చుట్టుముట్టారు. అతి సమీపం నుంచి వారిపై కాల్పులు జరిపారు. అనంతరం అంతే వేగంగా అక్కడి నుంచి అటవీ ప్రాంతంలోకి పారిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఆదిల్‌తోపాటు మరో ఇద్దరు ఉగ్రవాదుల ఊహాచిత్రాలను పోలీసులు విడుదల చేశారు. వీరి ఆచూకీ చెప్పినవారికి రూ.20లక్షల రివార్డు ప్రకటించారు. ముష్కరుల కోసం అనంత్‌నాగ్, పహల్గాం, చుట్టుపక్కల ఉన్న అటవీ ప్రాంతాలను జల్లెడ పడుతున్నారు.

# మాస్కోలో పేలుడు.. రష్యా సీనియర్ సైనికాధికారి మృతి




**మాస్కో, ఏప్రిల్ 26:** రష్యా రాజధాని మాస్కో శివారులో శుక్రవారం జరిగిన కారుబాంబు పేలుడులో సీనియర్ సైనికాధికారి లెఫ్టినెంట్ జనరల్ యారొస్లోవ్ మోస్కాలిక్ మృతి చెందారు. ఓ అపార్టుమెంట్ ఆవరణలో జరిగిన ఈ పేలుడుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఫోక్స్‌వాగన్ గోల్ఫ్ కారులో అమర్చిన పేలుడు పదార్థాలు పేలడంతో మొస్కాలిక్ మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. జనరల్ ఇంటి బయట ఈ కారు ఉందని, దాని పక్క నుంచి ఆయన వెళుతున్నప్పుడు పేలుడు జరిగిందని విచారణాధికారులు తెలిపారు. శాంతి చర్చల కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రాయబారి విట్‌కాఫ్ రష్యాలో అడుగుపెట్టిన సమయంలోనే ఈ దాడి జరగడం గమనార్హం. అంతకుముందు రష్యా విదేశాంగమంత్రి లవ్రోవ్ మాట్లాడుతూ, ఉక్రెయిన్‌తో యుద్ధం ముగించడానికి తమ దేశం సిద్ధంగా ఉందని తెలిపారు.

# గుజరాత్లో భారీ ఆపరేషన్.. 1000 మంది అక్రమ వలసదారులు అదుపులోకి..!



అహ్మదాబాద్, ఏప్రిల్ 26 : జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి నేపథ్యంలో అన్ని రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయి. వలసదారులపై ప్రత్యేక నిఘా పెట్టాయి. ఈ క్రమంలోనే గుజరాత్లో చేపట్టిన భారీ ఆపరేషన్లో 1000 మందికిపైగా బంగ్లాదేశీ అక్రమ వలసదారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరంతా తప్పుడు ధ్రువపత్రాలతో రాష్ట్రంలోకి ప్రవేశించినట్లు గుజరాత్ హోంమంత్రి హర్ష్ సంఘవి వెల్లడించారు.

శనివారం తెల్లవారుజామున 3 గంటల నుంచి రాష్ట్రంలోని పలు నగరాల్లో పోలీసులు పెద్ద ఎత్తున తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగానే అహ్మదాబాద్‌లో 890 మందిని, సూరత్‌లో 134 మందిని అదుపులోకి తీసుకున్నట్లు హోంమంత్రి తెలిపారు. వీరంతా పశ్చిమ బెంగాల్లో సరిహద్దులు దాటి భారత్‌లోకి ప్రవేశించినట్లు పేర్కొన్నారు. అక్కడ ఫోర్జరీ ప్రతాలు పొంది దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లినట్లు తెలిపారు.

''వీరిలో చాలా మంది డ్రగ్స్, మానవ అక్రమ రవాణా వంటి నేరాల్లో అనుమానితులుగా ఉన్నారు. ఇటీవల నలుగురు బంగ్లాదేశీయులను అరెస్టు చేయగా.. వారిలో ఇద్దరు అల్‌ఖైదా స్లీపర్ సెల్స్‌తో కలిసి పనిచేస్తున్నట్లుగా గుర్తించాం. ఈ క్రమంలోనే తాజాగా భారీ ఆపరేషన్ చేపట్టాం. వీరందరి పత్రాలను పరిశీలించిన తర్వాత.. త్వరలోనే దేశం నుంచి పంపిస్తాం'' అని హర్ష్ సంఘవి వెల్లడించారు. ఇక, రాష్ట్రంలో పాక్ జాతీయులు ఎవరైనా ఉంటే.. కేంద్రం తీసుకున్న నిబంధనల ప్రకారం వారు కూడా వెంటనే గుజరాత్‌ను వీడాలని స్పష్టం చేశారు. చట్ట వ్యతిరేకంగా దేశంలో ఉండే వారిపై న్యాయపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ వలసదారులు వెంటనే పోలీసులకు లొంగిపోవాలని సూచించారు.

## అమెరికాలో విదేశీ విద్యార్థులకు గుడ్న్యూస్.. హిష్కరణపై వెనక్కి తగ్గిన ట్రంప్

**శాన్ఫ్రాన్సిస్కో, ఏప్రిల్ 26:** ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లి బహిష్కరణ ముప్పు ఎదుర్కొంటున్న వందల మంది విద్యార్థులకు భారీ ఉపశమనం లభించింది. వారి వీసాలు/చట్టబద్ధ హోదాను రద్దు చేస్తూ ఇటీవల తీసుకున్న నిర్ణయంపై ట్రంప్ సర్కారు వెనక్కి తగ్గింది. ఆ విద్యార్థుల లీగల్ స్టేటస్‌ను పునరుద్ధరించింది. దాదాపు 1200 మంది విద్యార్థుల చట్టబద్ధ హోదాను అమెరికా పునరుద్ధరించింది. ఈమేరకు అమెరికా ప్రభుత్వానికి చెందిన ఓ న్యాయవాది తాజాగా వెల్లడించారు.

అక్రమ వలసదారులపై కఠినంగా వ్యవహరిస్తున్న అధ్యక్షుడు డొనాల్ ట్రంప్.. విదేశీ విద్యార్థులపైనా ఉక్కుపాదం మోపిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే వివిధ కారణాలతో 187 కాలేజీలకు చెందిన 1200 మందికి పైగా విదేశీ విద్యార్థుల వీసా లేదా వారి చట్టబద్ధ





హోదాలను రద్దు చేసింది. దీంతో డిపోర్టేషన్, నిర్బంధం ముప్పు పొంచి ఉండటంతో ఆ విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. వీరిలో కొంతమంది ఇప్పటికే అమెరికాను వీడగా.. కొందరు రహస్య ప్రదేశాల్లో తల దాచుకున్నారు. ఇంకొందరు క్లాసులకు వెళ్లడం లేదు.

తమ వీసాల రద్దుపై విద్యార్థులు న్యాయస్థానాలను ఆశ్రయించారు. కాలిఫోర్నియా, బోస్టన్ కోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన ఆయా న్యాయస్థానాలు.. విద్యార్థుల వీసా రద్దును ఆపాలంటూ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ క్రమంలోనే ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్.. ఆయా విద్యార్థుల చట్టబద్ధ హోదాను తాత్కాలికంగా పునరుద్ధరించింది.

సాధారణంగా వీసా లేదా చట్టబద్ధ హోదా రద్దయినప్పుడు.. విదేశీ విద్యార్థుల వివరాలను పొందుపర్చే డేటాబేస్ నుంచి వారి వివరాలు తొలగిస్తారు. అయితే, ఈ రికార్డుల టెర్మినేషన్‌కు సంబంధించిన ట్రంప్ సర్కారు త్వరలోనే కొత్త పాలసీ తీసుకురానున్నట్లు తెలుస్తోంది. అప్పటివరకు తొలగించిన విద్యార్థుల రికార్డులన్నింటినీ తిరిగి యాక్టివేట్ చేస్తున్నట్లు ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. దీంతో ఆయా విద్యార్థులకు చట్టబద్ధ హోదా లభిస్తుందన్నారు. వీసాలు రద్దయిన వారిలో కొంతమంది భారతీయ విద్యార్థులు కూడా ఉన్నట్లు సమాచారం. ట్రాఫిక్ ఉల్లంఘనలు వంటి చాలా చిన్న కారణాలతోనే వారి చట్టబద్ధ హోదాను తొలగించినట్లు అమెరికన్ ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్ పేర్కొంది.

# ఇరాన్ నౌకాశ్రయంలో భారీ పేలుడు





- **400 మందికిపైగా గాయాలు**

టెహ్రాన్,ఏప్రిల్ 26: ఇరాన్‌లో పెను ప్రమాదం చోటుచేసుకుంది. తీరప్రాంత నగరమైన బందర్ అబ్బాస్ సమీపంలోని రజేయీ నౌకాశ్రయంలో భారీ పేలుడు సంభవించింది. ఈ క్రమంలోనే ఘటనాస్థలంలో మంటలు చెలరేగినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ఈ ఘటనలో దాదాపు 406 మంది గాయపడ్డారని నేషనల్ ఎమర్జెన్సీ ఆర్గనైజేషన్ ప్రతినిధి తెలిపినట్లు పేర్కొంది.

ప్రమాదానికి గల కారణాలు ప్రస్తుతానికి తెలియరాలేదని అధికారులు చెప్పారు. అయితే, పోర్టులోని కంటెయినర్ల నుంచి పేలుడు సంభవించినట్లు భావిస్తున్నామని తెలిపారు.

పేలుడు అనంతరం దట్టమైన పొగలు వెలువడుతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. ఘటనాస్థలం నుంచి కొన్ని కిలోమీటర్ల దూరంలో భవనాల అద్దాలు ధ్వంసమైనట్లు నెటిజన్లు చెబుతున్నారు. పేలుడు ధాటికి ఓ భవనం కూలిపోయినట్లు ఇరాన్ మీడియా తెలిపింది. ఇదిలా ఉండగా.. రజేయీ ఓడరేవులో ప్రధానంగా కంటెయినర్ల కార్యకలాపాలు కొనసాగుతుంటాయి. ఏటా 80 మిలియన్ టన్నుల సరకు ఎగుమతి, దిగుమతి అవుతుంది. స్థానికంగా చమురు ట్యాంకులు, పెట్రో కెమికల్ సౌకర్యాలు ఉన్నాయి.

# ముంబయి దాడులతో నాకు సంబంధం లేదు

- **విచారణలో తహవ్వుర్ రాణా**

ముంబయి, ఏప్రిల్ 26: అమెరికా నుంచి తీసుకొచ్చిన ముంబయి ఉగ్రదాడి కేసు నిందితుడు తహవ్వుర్ హుస్సేన్ రాణా ప్రస్తుతం జాతీయ దర్యాప్తు సంస్థ కస్టడీలో ఉన్నాడు. ముంబయి ఉగ్రదాడి కేసు నిందితుడు తహవ్వుర్ రాణాను పోలీసులు దాదాపు ఎనిమిది గంటల పాటు విచారించారు. ఈ విచారణకు అతడు సహకరించకుండా.. తప్పించుకునే రీతిలో సమాధానాలు చెప్పినట్లు తెలుస్తోంది. ఈ విచారణలో ముంబయి ఉగ్రదాడులతో తనకు ఎలాంటి సంబంధం లేదని రాణా పేర్కొన్నట్లు తెలుస్తోంది. అంతేకాక, తన 'ఫస్ట్ వరల్ ఇమిగ్రేషన్ సర్వీస్' అనేది చట్టబద్ధమైనదని, దానికి, ఉగ్రవాద కార్యకలాపాలకు ఎలాంటి సంబంధం లేదని తెలిపాడు. అయితే, విచారణకు సహకరించుకుండా తప్పించుకునే రీతిలో సమాధానాలు ఇస్తున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఫస్ట్ వరల్ ఇమిగ్రేషన్ సర్వీస్ అనేది రాణాకు సంబంధించిన ఒక వ్యాపార సంస్థ. ఇక, తహవ్వుర్ రాణాపై త్వరలోనే ఛార్జిషీట్ దాఖలు చేయనున్నట్లు




అధికారులు తెలిపారు. అమెరికాలోని లాస్ ఏంజెలెస్ నుంచి ఇటీవల రాణాను జాతీయ దర్యాప్తుసంస్థ బృందం భారత్‌కు తీసుకొచ్చింది. అతడిని 18 రోజుల కస్టడీకి అప్పజెపుతూ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. దీంతో ఎన్ఐఏ అతడిని విచారించడం మొదలుపెట్టింది. ముంబయి దాడులకు సూత్రధారులను గుర్తించే పనిని మొదలుపెట్టింది.



## అన్నమయ్య జిల్లాలో విషాదం.. చెరువులో మునిగి నలుగురి మృతి

**అన్నమయ్య జిలా, ఏప్రిల్ 26:** అన్నమయ్య జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. ములకలచెరువు మండలంలోని పెద్దచెరువులో మునిగి నలుగురు ప్రాణాలు కోల్పోయారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈశ్వరమ్మ అనే మహిళ బట్టలు ఉతికేందుకు చెరువు వద్దకు పిల్లలతో కలిసి వెళ్లింది. కుమార్తె లావణ్య, కుమారుడు నందకిశోర్ ఆడుకుంటూ నీళ్లలోకి వెళ్లారు. వారిద్దరితోపాటు మరో చిన్నారి నందిత కూడా చెరువులో గల్లంతై మృతి చెందింది. పిల్లల్ని కాపాడేందుకు వెళ్లిన ఈశ్వరమ్మ భర్త మల్లేశ్ కూడా ప్రాణాలు కోల్పోయాడు. ఘటనాస్థలికి చేరుకున్న స్థానికులు నలుగురి మృతదేహాలను బయటకు తీసుకొచ్చారు.

# పాక్ ప్రధాని షెహబాజ్‌కు ఒమర్ అబ్దుల్లా కౌంటర్



**జమ్ము, ఏప్రిల్ 26:** ఉగ్రదాడిపై తటస్థ దర్యాప్తునకు తాము సిద్ధమేనని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ చేసిన ప్రకటనపై జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పహల్గాంలో పర్యటకులపై ఉగ్రదాడిపై తటస్థ దర్యాప్తునకు తాము సిద్ధమేనని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆ పాశవిక ఘటనను తొలుత పాకిస్థాన్ తోసిపుచ్చిందని, భారత్‌పైనే నిందలు వేసిన విషయాన్ని గుర్తుచేస్తూ విమర్శలు గుప్పించారు. ''పహల్గాంలో జరిగిన ఘటనను కనీసం వాళ్లు గుర్తించలేదు. ఆ ఘటన వెనక భారత్ ఉందని మొదట ఆరోపించారు. మనపై ఆరోపణలు చేయడంలో ముందుండే వాళ్లకు ఇప్పుడేమీ చెప్పలేం. వారి ప్రకటనలకు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వాలనుకోవడం లేదు. దురదృష్టకరమైన ఆ ఘటన జరిగి ఉండాల్సింది కాదు'' అని ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వాలోని మిలిటరీ అకాడమీ గ్రాడ్యుయేషన్ వేడుకల్లో పాల్గొన్న ప్రధాని షెహబాజ్ షరీఫ్.. తాజా ఉద్రిక్తతలపై స్పందించారు. ''పహల్గాంలో ఇటీవల జరిగిన విషాదకర ఘటనతో మరోసారి మన దేశం నిందలు ఎదుర్కొంటోంది. ఆ ఘటనపై తటస్థ, పారదర్శక, విశ్వసనీయ దర్యాప్తులో పాల్గొనేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. శాంతికే మా ప్రాధాన్యం'' అని షరీఫ్ తెలిపారు. ఉగ్రవాదాన్ని తాము కూడా ఖండిస్తామంటూ పేర్కొనడంపై జమ్మూ కశ్మీర్ సీఎం విమర్శలు గుప్పించారు.

## ఆస్తిలో చెల్లికి వాటా.. కక్షతో తల్లిదండ్రులను హత్య చేసిన కుమారుడు

**విజయనగరం, ఏప్రిల్ 26:** ఆస్తి కోసం కన్న తల్లిదండ్రులను దారుణంగా హత్య చేశాడు ఒక వ్యక్తి. ఈ దారుణ ఘటన విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం నడిపూరికల్లాలులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తన తల్లిదండ్రులు ఆస్తిలో చెల్లికి వాటా ఇవ్వడంతో రాజశేఖర్ అనే వ్యక్తి వారిపై కక్ష పెంచుకున్నాడు. ఈ విషయంపై కుమారుడితో కొంతకాలంగా వివాదం కొనసాగుతోంది. కుమార్తెకు ఇచ్చిన భూమిని చదును చేస్తుండగా తనను అడ్డుకోవడంతో తల్లిదండ్రులతో వాగ్వాదానికి దిగాడు. అనంతరం అప్పలనాయుడు (55), జయ (45)లను ట్రాక్టర్తో ఢీకొట్టి చంపాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



# రాహుల్ గాంధీకి పుణె కోర్టు సమన్లు

**పుణె,ఏప్రిల్ 26:** లండన్ పర్యటన సమయంలో స్వాతంత్ర్య సమరయోధుడు సావర్కర్‌ను ఉద్దేశిస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో తాజాగా పుణె కోర్టు ఆయనకు సమన్లు జారీ చేసింది. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి పుణె కోర్టు శనివారం సమన్లు జారీ చేసింది. లండన్ పర్యటన సమయంలో స్వాతంత్ర్య సమరయోధుడు వినాయక్ దామోదర్ సావర్కర్‌ను ఉద్దేశిస్తూ రాహుల్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఈ సమన్లు అందాయి.

లండన్ పర్యటన సమయంలో రాహుల్ సావర్కర్‌ను ఉద్దేశిస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో సావర్కర్ మనవడు సత్యకి సావర్కర్ రాహుల్‌పై పరువునష్టం దావా దాఖలు చేశారు. ఈ కేసుకు సంబంధించి ప్రాథమిక ఆధారాలు ఉన్నట్లు పోలీసులు గతంలో తేల్చారు.



కాగా.. దీనిపై తాజాగా విచారణ జరిపిన న్యాయస్థానం మే 9న ఆయన తమముందు హాజరుకావాలని కోరుతూ సమన్లు జారీ చేసింది.కాగా.. భారత్ జోడో యాత్ర సమయంలో వీర్ సావర్కర్‌పై రాహుల్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే.

దీనిపై అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు కాగా.. ఇటీవల హైకోర్టు రాహుల్‌కు సమన్లు జారీ చేసింది. వాటిని సవాలు చేస్తూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై శుక్రవారం విచారణ జరగ్గా.. సుప్రీం రాహుల్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆయన వ్యాఖ్యలు బాధ్యతారహితమైనవిగా పేర్కొంది. రాహుల్ వ్యాఖ్యలను మందలిస్తూనే.. ఆయనపై క్రిమినల్ చర్యలను నిలిపివేసింది. దీంతో ఆయనకు భారీ ఊరట లభించినట్లైంది.

# నగరాభివృద్ధే ప్రధాన అజెండా

- వాడివేడిగా నగరపాలక సర్వసభ సమావేశం
- రూ.9.22 కోట్ల అభివృద్ధి పనులకు గ్రీన్ సిగ్నల్
- సమస్యల పరిష్కారం కోసం సభ్యుల పట్టు
- మూడు కూడళ్ళకు, రెండు ప్రాంతాలకు కొత్త పేర్లు




**కర్నూలు;ఏప్రిల్ 26మనం న్యూస్:** కర్నూలు నగరాభివృద్ధే ప్రధాన అజెండగా నగరపాలక సర్వసభ్య సమావేశం జరిగింది. శనివారం స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని కౌన్సిల్ హాలులో మేయర్ బి.వై. రామయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు గౌరు చరిత రెడ్డి, బొగ్గుల దస్తగిరి, కమిషనర్ యస్.రవీంద్ర బాబు బాబు సమావేశానికి హాజరయ్యారు. ముందుగా జమ్మూ కాశ్మీర్లోని పహల్గాంలో పర్యాటకులపై ముష్కరుల దాడిలో మృతి చెందిన 28 మందికి, ఇటీవల మృతి చెందిన 38వ వార్డు కార్పొరేటర్ గిప్సన్ ఆత్మలకు శాంతి చేకూరాలని రెండు సభ సభ్యులంతా మౌనం పాటించారు. అనంతరం సర్వసభ్య సమావేశానికి తొలిసారి వచ్చిన ఎంపీ బస్తిపాటి నాగరాజుకి వేదికపై సత్కరించారు. అనంతరం మొత్తం 26 తీర్మానాలపై పాలకవర్గ సభ్యులు చర్చించి ఆమోదం తెలిపారు. రూ.9.22 కోట్లతో రహదారులు, మురుగు కాలువలు, ఇతరత్రా అభివృద్ధి పచ్చజెండా ఊపారు. సమావేశం ప్రారంభించిన కాసేపటికి కాస్త గందరగోళం ఏర్పడడంతో, మేయర్ సభను పది నిమిషాల పాటు వాయిదా వేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఇంజనీరింగ్ విభాగం అధికారులు స్పందించే విధానంపై పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో తాగునీటి సమస్య, విద్యుత్ దీపాలు, మరుగుదొడ్ల మరమ్మత్తులు, విద్యుత్ శాఖ కొమ్మలను నరికేసి అలాగే వదిలేయడం వంటి సమస్యలపై వాడివేడిగా చర్చ సాగింది. అలాగే కార్పొరేటర్లు వారి వార్డుల్లోని సమస్యలను లేవనెత్తారు. వాటి పరిష్కారం కోసం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలను మినిట్స్ పెట్టి, వాటి పురోగతి స్థితిగతులను ఆయా సభ్యులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. నగర పరిధిలో ఎక్కడికైనా నిమిషాల వ్యవధిలో వెళ్ళవచ్చని, అధికారులు సమస్యల పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో వెళ్లాలని, అధికారుల మధ్య సమన్వయం ఉండాలని సూచించారు. తాగునీటి సమస్య పరిష్కారానికి రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ప్రతిపాదనను రూపొందించాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి ఏదైనా పథకాల ద్వారా నిధులు వచ్చేందుకు అవకాశం ఉంటే, అధికారులు తన దృష్టికి తీసుకుని రావాలన్నారు. ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి మాట్లాడుతూ.. కల్లూరు 16 వార్డుల్లో తాగునీటి సమస్య చాలా ఉందని, మెరుగుపరిచేందుకు అధికారులు వీలైనంత మేర చర్యలు తీసుకోవాలన్నారు. గోరుకల్లు నుండి కర్నూలుకు తాగునీరును తీసుకొచ్చి ఎందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సుముఖంగా ఉన్నారని, అందుకు సంబంధించిన ప్రతిపాదనలను అధికారులు తయారు చేయాలన్నారు. వీధి దీపాలు, మరుగుదొడ్ల మరమ్మతులు వెంటనే చేపట్టాలని, రహదారులు, మురుగు కాలువల నిర్మాణంలో జాప్యం చేయొద్దని సూచించారు. హంద్రీ నదిపై పార్కులు, రహదారుల నిర్మాణం చేసేటప్పుడు న్యాయపరమైన చిక్కులు లేకుండా అనుమతులు తీసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తేవద్దని అధికారులకు సూచించారు. పారిశుధ్యాన్ని మరింత మెరుగుపరచాలని, పుష్కార్టులు లేక సంచుల్లో చేత సేకరించడం బాధాకరమన్నారు. పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి అధికారులు అవసరమైన చర్యలు తక్షణమే తీసుకోవాలని ఆదేశించారు. కోడుమూరు ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగరపాలక సంస్థ పరిధిలోని కోడుమూరు మూడు వార్డుల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని, మామిదాలపాడులో రహదారులు, మురుగు కాలువలు నిర్మాణం చేపట్టాలన్నారు. కేసి కెనాల్లో మురుగునీరు ఎక్కువైందని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. బంజార కాలనీ ప్రభుత్వ స్థలంలో స్కూల్ నిర్మించాలన్నారు. ఎల్కూట, మాస మసీద్, స్టాంటన్పురం వంటి సమస్యాత్మక ప్రాంతాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, ఎస్ఈ రాజశేఖర్, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఆర్ఓలు జునైద్, ఇశ్రాయేల్, టిపిఆర్ఓ వెంకటలక్ష్మి, సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## సిఐ ,ఎస్ఐ లకు జిల్లా ఎస్పీ ప్రశంసలు



**మంత్రాలయం, , ఏప్రిల్ 26,(మనం న్యూస్) :** మంత్రాలయం సిఐ రామానుజులు , మాధవరం ఎస్ఐ విజయకుమార్ కు శనివారం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రశంసా పత్రాన్ని అందజేశారు. గ్రామాల్లో శాంతిభద్రతలు , పలు కేసులు నియంత్రణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

## విద్యార్థినికి అభినందనలు



**మంత్రాలయం,ఏప్రిల్ 26, (మనం న్యూస్ ):** మంత్రాలయం మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామానికి చెందిన తలారి రఘువీరా కుమార్తె తలారి గీతాంజలి ఇటీవల విడుదలైన పది పరీక్షలలో 600 మార్కులు గాను 544 మార్కులతో మండల తృతీయ టాపర్ గా నిలిచింది. ఈ సందర్భంగా శనివారం విద్యార్థిని గీతాంజలితో పాటు కుటుంబ సభ్యులు ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం లో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. ముందుగా విద్యార్థిని గీతాంజలికి సబ్ కలెక్టర్ అభినందించారు. మంచిగా చదివి తల్లిదండ్రులకు గ్రామానికి, జిల్లా కు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థిని డైరీని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ మోడల్ స్కూలు ఉపాధ్యాయులు ఉన్నారు.

## మతసామరస్య చైతన్య వేదిక ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ



**బేతంచేర్ల,ఏప్రిల్ 26(మనం న్యూస్ ):** పట్టణంలో మతసామరస్య చైతన్య వేదిక ఆధ్వర్యంలో జమ్మూ కాశ్మీర్ పహల్గాం లో దాడిని ఖండిస్తూ పట్టణంలో పాత బస్టాండ్ నందు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు అనంతరం వారు మాట్లాడుతూ మన భారతదేశం లో పాకిస్తాన్ ముస్కర్లు దాడి చేయడం భారతీయులుగా మేము ఖండిస్తున్నామని గౌస్ అన్నారు దాడిలో పాకిస్తాన్లు హిందువా ముస్లిమా మరి అని అడిగి హతమార్చడం పై మన భారతదేశంలో కులమతాల చిచ్చు పెట్టడానికని మనమందరం ఐక్యమతంగా ఉండి మనమంతా ఒక భారతీయులుగా పాకిస్తాన్ చేస్తున్న దాడిని ప్రతి ఒక్కరు ఖండించాలని ప్రధానమంత్రి మోడీ దాడి చేసిన పాకిస్తాన్ ముస్కర్లు వెంటనే శిక్షించాలని మన భారతదేశం లో ప్రతి ఒక్కరు కోరుకుంటున్నారు అన్నారు నిరసన కార్యక్రమంలో నూర్ అహ్మద్ జయంత్ గౌడ్ గౌస్ రషీద్ శాలిబ్ గ్ మారుతి శర్మ నాగమోహన్ గూని నాగరాజు నరేంద్ర గౌడ్ పింజరి దస్తగిరి కులమతాలకు అతీతంగా సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంత్రాలయంలో బాంబు డాగ్ స్క్వాడ్ తనిఖీలు

**మంత్రాలయం ,ఏప్రిల్ 26, మనం న్యూస్ :** ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమెన మంత్రాలయంలో బాంబు డాగ్ స్క్వాడ్ సిబ్బంది శనివారం తనిఖీలు చేపట్టారు. పహల్గామ్ లో ఉగ్రవాదులు 26 మందిని చంపిన ఘటన నేపథ్యంలో జిల్లా జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు మంత్రాలయం సీఐ రామంజులు, ఎస్ఐ శివాంజల్ ఆధ్వర్యంలో శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం, తుంగభద్ర నదీ తీరంలో గంగమ్మ గుడి, ఆంజనేయ స్వామి గుడి, వెంకటేశ్వర స్వామి, రామలింగేశ్వరస్వామి, ఆంజనేయస్వామి దేవాలయాల్లోనూ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో బాంబ్, డాగ్ స్క్వాడ్ తో తనిఖీలు నిర్వహించారు. మంత్రాలయం కు వచ్చే కర్ణాటక, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర బస్సులు, కార్లు, సామాగ్రిని క్షుణ్ణంగా పరిశీలించి ముందుకు పంపారు. ఎవ్వరైనా అనుమానితులు కన్పిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ తనిఖీల్లో బాంబు స్క్వాడ్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ విపి ఆచారి పోలీసు నాగేశ్వర్ రెడ్డి డాగ్ స్క్వాడ్ పోలీసు ప్రసాద్, స్థానిక హెడ్ కానిస్టేబుళ్లు వెంకటేశ్వర్లు, ఎంవి రమణ, భాస్కర్, మల్లికార్జున స్వామి, పోలీసులు రామకృష్ణ గోపి హోంగార్డ్ నాగేశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.



## టిడిపి నాయకుడు మృతి తీరని లోటు



**దేవనకొండ,ఏప్రిల్ 26(మనంన్యూస్):** మండల పరిధిలోని తెర్నేకల్ గ్రామంలో తెలుగుదేశం నాయకులు వడ్డె తిమ్మప్ప( 45 ) శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు.టిడిపి నాయకుడు మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న మాజీ సర్పంచ్ రాజన్న, టిడిపి,జనసేన, నాయకులను మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి సేవలు చేశారని కొనియాడారు. ఆయన మృతి తీరని లోటు అన్నారు.

## రాయితీ యంత్ర పరికరాలకు దరఖాస్తు చేసుకోండి

- టీడీపీ ఇన్చార్జి ఎన్. రాఘవేంద్రరెడ్డి



**మంత్రాలయం , ఏప్రిల్ 26, మనం న్యూస్ :** మంత్రాలయం నియోజకవర్గంలో ఉన్న చిన్న సన్నకార రైతులు ప్రభుత్వం ఇచ్చే రాయితీ యంత్ర పరికరాలకు దరఖాస్తు చేసుకోవాలని మంత్రాలయం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొంతమంది రైతులు ఇదివరకే రాయితీ యంత్ర పరికరాల కొరకు దరఖాస్తు చేసుకున్నారని , అవి ఈ నెల 22వ తేదీన స రాయితీ యంత్రాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు . నియోజకవర్గంలో మరికొన్ని సబ్సిడీ వ్యవసాయ పనిముట్లకు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ రంజిత్ భాష , జాయింట్ కలెక్టర్ ను కోరడమైనదని వారు స్పందించి నియోజకవర్గానికి తక్షణమే సబ్సిడీ వ్యవసాయ పనిముట్లు మంజూరు చేశారని వారు తెలిపారు . అలాగే చిన్న సన్నకార రైతులు కూడా తమ గ్రామాలలో ఉన్న వ్యవసాయ అధికారులు దగ్గరకు వెళ్లి సబ్సిడీ వ్యవసాయ పనిముట్ల కొరకు దరఖాస్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## చలువ పందిళ్లు ఏర్పాటు



**మహానంది, ఏప్రిల్26,మనంన్యూస్.** భానుడి తాపానికి భక్తులు ఇబ్బంది పడకుండా ఆలయ ప్రాంగణంలో చలువ పందిర్లను దేవస్థానం ఈఓ శ్రీనివాస రెడ్డి ఏర్పాటు చేయించారు. వేసవికాలం కావడంతో భక్తులు మహానంది క్షేత్రానికి అధికసంఖ్యలో రావడం జరుగుతుంది. ఎండలు మండుతుండటంతో భక్తులు వేసవి తాపానికి గురికాకుండా ఉండేందుకు చలువ పందిర్లను ఏర్పాటు చేసినట్లు ఈఓ తెలిపారు. క్షేత్రానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవ్వకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ఇక్ఫాయ్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ 17 వ డాక్టోరల్ థీసిస్ కాన్ఫరెన్స్ కు ధనుంజయ ఎంపిక



**దేవనకొండ,ఏప్రిల్ 26మనం న్యూస్:** మండల పరిధిలోని పొట్లపాడు గ్రామానికి చెందిన బండారి ధనుంజయ కడప జిల్లాలోని యోగివేమన యూనివర్సిటీ డిపార్ట్మెంట్ ఆఫ్ ఎకనామిక్స్ విభాగంలో ప్రొఫెసర్ శ్రీనివాసులు బైనేని గారి దగ్గర 'భారతదేశంలోని గ్రామాలలో ఉపాధి పెరుగుదల' అనే అంశంపై పిహెచ్డి రీసెర్చ్ చేస్తున్నట్లు తెలిపారు. అయితే హైదరాబాదులోని ఇక్ఫాయ్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ మరియు ముంబై ఇందిరా గాంధీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డెవలప్మెంట్ రీసెర్చ్ ఆధ్వర్యంలో మే 22 మరియు 23 తేదీలలో 17వ డాక్టోరల్ థీసిస్ కాన్ఫరెన్స్ జరగనుంది. అయితే ఈ సమావేశాలకి దేశ విదేశాల్లో మరియు రిజర్వ్ బ్యాంక్ అలాగే ప్రపంచ బ్యాంకు వంటి సంస్థల నుంచి ఎకనామిస్టులు, ప్రొఫెసర్లు, నిపుణులు పాల్గొననున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశాలలో బండారి బండారి ధనుంజయ 'ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో రెవెన్యూ ఆదాయం వ్యయం మూలధన ఆదాయం వ్యయం వాటి లోటు సమస్యలపై ఆర్థిక క్రమశిక్షణ ఎలా' అనే అంశంపై ప్రసంగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమా వేశాలకు పొట్లపాడు వాసి అయిన బండారి ధనుం జయ ఎంపిక కావడం పట్ల డిపార్ట్మెంట్ ఆఫ్ ఎకనామిక్స్ మరియు గ్రామస్తులు, స్నేహితులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## కూలీలకు ప్రభుత్వం చెప్పేదొకటి చేసేది ఒకటి

**దేవనకొండ, ఏప్రిల్ 26(మనం న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఉపాధి కూలీలకు కనీస వేతనం 200 కాకుండా దినసరి కూలీలు 50 రూపాయలు ఇవ్వడం సిగ్గుచేటు అన్నారు. ఉపాధి కూలీలకు నెల రోజులైనా వేతనాలు చెల్లించకపోవడంతో పస్తులు ఉండాల్సిన దుబ్బరి స్థితి నెలకొంది. నిత్యం ఉపాధి పనులకు వెళ్లాలన్న ఆటో చార్జీలు, ఇతర సౌకర్యాలు గిట్టుబాటు ధర అయ్యేలా చర్యలు తీసుకోవాలి. ఉపాధి కూలీలకు కనీస వేతనం 200 రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు.కానీ రాష్ట్ర ప్రభుత్వం 50 రూపాయలు ఇవ్వడం పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఫీల్ అసిస్టెంట్లు టెక్నికల్ అసిస్టెంట్లు, ఈ సి ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లిస్తామని అసత్య ప్రచారాలు చేస్తున్నారు. అసలే వేసవికాలం దృష్ట్యా చెట్ల కింద, ఆయా పనులకు వెళ్లే ఉపాధి కూలీలను ఆదుకోవాలని కోరారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి కనీస వేతనం చెల్లించాలని కోరారు.

## అవయవ దానం పై అవగాహన కలిగి ఉండాలి



**కర్నూలు ఏప్రిల్ 26మనం న్యూస్:** అవయవ దానంపై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించడానికి విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని లయన్స్ జిల్లా మాజీ అడిషనల్ డిస్టిక్ క్యాబినెట్ సెక్రెటరీ లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్, నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నైస్ కంప్యూటర్స్ కార్యాలయంలో నేడు అవయవదానం పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు .ఈ సందర్భంగా లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రత్యేకంగా బ్రెయిన్ డెడ్ అయిన సందర్భంలో అవయవదానం చేయడం ఎలా ,ఎలా నమోదు చేసుకోవాలి పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్ కార్యదర్శి లయన్ టి. గోపీనాథ్, గౌరవాధ్యక్షులు లయన్ మహేంద్ర ,లయన్స్ సభ్యులు కేడీజే బాబు, లయన్ మంజునాథ్ ,ఉపాధ్యాయులు కేకే దామోదర్ రావు, కె . రాజగోపాల్ ,కే. శ్రీనివాసులు పాల్గొన్నారు.

## కర్నూలు కార్పొరేషన్ అభివృద్ధికి కృషి చేస్తా

- ఎం.పి బస్తిపాటి నాగరాజు

**కర్నూలు ఏప్రిల్ 26మనం న్యూస్:** కర్నూలు కార్పొరేషన్ అభివృద్ధి కి కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం అందాలన్న తన వంతు ప్రయత్నం చేస్తానని ఎం.పి బస్తిపాటి నాగరాజు అన్నారు.. నగరంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్ లో నిర్వహించిన నగర పాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు.. ఈ సందర్భంగా సమావేశానికి మొదటి సారి వచ్చిన ఎం.పి కి మేయర్ రామయ్య, మున్సిపల్ కమీషనర్ రవీంద్ర బాబులు సన్మానించారు.. సమావేశంలో భాగంగా ఎం.పి మాట్లాడుతూ నగరంలో నీటి, పారుశుధ్య సమస్య తీవ్రంగా ఉందన్నారు.. అధికారులు , కార్పొరేటర్లు సమన్వయంతో నగరాన్ని అభివృద్ధి పరచాలన్నారు. కార్పొరేషన్ పరిధిలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్న ఆయన.. రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్న కూటమి ప్రభుత్వానికి ఎక్కడా చెడ్డ పేరు తీసుకురాకుండా సమావేశంలో కార్పొరేటర్లు చెప్పే ప్రతి సమస్యను అధికారులు మినిట్స్ బుక్కులో పొందపరుచుకొని వాటిని పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు ఎం.ఎల్.ఏ బొగ్గుల దస్తగిరి, పాణ్యం ఎం.ఎల్.ఏ గౌరు చరిత, మేయర్ రామయ్య, మున్సిపల్ కమిషనర్ రవీంద్ర బాబు, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.



## ఉపాధి పనులను పరిశీలించిన డ్వామా పీడీ



**తుగ్గలి, ఏప్రిల్ 26( మనం న్యూస్ ):** తుగ్గలి మండల పరిధిలోని రాతన గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శనివారం డ్వామా పీడీ వెంకట రమణయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఉపాధి కూలీలతో పనులపై పలు విషయాలు మాట్లాడారు. వేసవి ఎండల తీవ్రత పెరుగుతున్నందున పని ప్రదేశంలో కూలీలు సేద తీరేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, ఎండల బారిన పడకుండా ఉండేందుకు ఓఆర్ఎస్ పాకెట్లను అందుబాటులో ఉంచాలని ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. కొలతల ప్రకారం పని వివరాలను పక్కాగా రికార్డుల్లో నమోదు చేయాలన్నారు.పీడీ వెంకట రమణయ్య వెంట అడిషనల్ ప్రోగ్రాం ఆఫీసర్ హేమ సుందర్, టెక్నికల్ అసిస్టెంట్ శాంత్ రాజ్,ఫీల్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధి పనులు కల్పించండి

**తుగ్గలి, ఏప్రిల్ 26(మనంన్యూస్):** తుగ్గలి మండల పరిధిలోని ఉప్పర్లపల్లె గ్రామంలో ఇప్పటికి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పనులను కల్పించలేదని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు జి.శ్రీరాములు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ ఉప్పర్లపల్లె గ్రామంలో పనులను వెంటనే ప్రారంభించి కూలీలకు ఉపాధి కల్పించాలన్నారు. ప్రధానంగా ఉపాధి హామీ క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం వల్లనే పనులు లభించక అనేకమంది పేదలు వలస బాట పడుతున్నట్లు తెలిపారు. ఉప్పర్లపల్లె గ్రామంలో పని కల్పించాలని పలుమార్లు కూలీలు ఒత్తిడి తెచ్చినా అధికారులు పట్టించుకోలేని దుస్థితి ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు శ్రీరాములు,ఉప్పర్లపల్లె ఉపాధి హామీ కూలీలు ఈరమ్మ, రామాంజినమ్మ, రంగమ్మ,సునీత, వెంకటలక్ష్మి ఈ ధర్నాలో పాల్గొన్నారు. ఇప్పటికైనా స్పందించి ఉప్పర్లపల్లె గ్రామంలో ఉపాధి పనులు చేపట్టాలని అడిషనల్ ప్రోగ్రాం ఆఫీసర్ ను కోరారు.






# ధోనీ ఎప్పుడూ వేలంలో పాల్గొనలేదు: సురేశ్ రైనా

ఐపీఎల్ 2025 సీజన్ లో చెన్నై సూపర్ కింగ్స్ ప్లేఆఫ్స్ కు వెళ్లడం దాదాపు కష్టమే. తొమ్మిది మ్యాచుల్లో కేవలం రెండే విజయాలు సాధించిన సీఎస్కే.. మిగిలిన ఐదు గెలిచినా నాకౌట్ కు వెళ్తుందని చెప్పడం కష్టమే. అయితే, ఇతర జట్ల అవకాశాలను ఎలా ప్రభావితం చేస్తుందనేదే ఇక్కడ ఆసక్తికర అంశం. మెగా వేలం సందర్భంగా సరైన ఆటగాళ్లను ఎంపిక చేసుకోవడంలో సీఎస్కే వెనకబడిందని మాజీ క్రికెటర్ సురేశ్ రైనా వ్యాఖ్యానించాడు. ధోనీ ఉన్నా.. మిగతా క్రికెటర్లు రాణిస్తేనే విజయం వరిస్తుందని పేర్కొన్నాడు. అయితే, ధోనీ ఎప్పుడూ వేలంలో పాల్గొనేవాడు కాదని గుర్తు చేశాడు.

''కాశీ సర్ కు అడ్మినిస్ట్రేషన్ కు 30ఏళ్లకుపైగా అనుభవం ఉంది. రూపా మేడమ్ కు క్రికెట్ వ్యవహారాలు, ఆటగాళ్లను ఎలా కొనుగోలు చేయాలి, గ్రూప్ ను ఎలా నిర్వహించాలనే విషయాలపై పట్టు ఉంది. అయితే, ఈసారి మాత్రం సరైన ఎంపికలు చేసినట్లు అనిపించలేదు. ఇది ప్రతిఒక్కరి భావన. ధోనీ ఉన్నా కూడా ఇలా ఎందుకు జరిగిందని కొందరు అడుగుతారు. నిజాయతీగా చెప్పాలంటే.. నేను ఎప్పుడూ వేలం ప్రక్రియకు హాజరుకాలేదు. అలాంటి చర్చల్లో భాగం కాలేదు. నేనెప్పుడైనా సరే రిటైన్ చేసుకున్న ప్లేయర్ల గురించే మాట్లాడేవాడిని. ధోనీ కూడా తన నిర్ణయం ఏంటో చెప్పేవాడు. అంతేకానీ, వేలంలో ఎప్పుడూ భాగం కాలేదు. కోర్ గ్రూప్లోని సభ్యులే ఆక్షన్లో పాల్గొంటారు. ధోనీ ఇలాంటి వేలానికి హాజరుకాడు. ఓ నలుగైదుగురు పేర్లను మాత్రమే సూచిస్తాడు. ఎవరిని రిటైన్ చేసుకోవాలో చెబుతాడు. 43 ఏళ్ల వయసులో అన్క్యాప్డ్ ప్లేయర్గా బరిలోకి దిగిన ధోనీ కష్టపడుతుంటే.. మిగతా పది మంది ఏం చేస్తున్నట్లు? అందులో కొందరికి రూ.18 కోట్లు, రూ.17 కోట్లు, రూ.12 కోట్లు దక్కాయి. మేనేజ్మెంట్ నమ్మి అవకాశం ఇచ్చినప్పుడు సద్వినియోగం చేసుకోవాలి. కానీ, ప్రతిసారీ అదే తప్పులతో విఫలం కావడం చూస్తున్నాం'' అని రైనా వ్యాఖ్యానించాడు.

**ఇప్పటికీ మాది మంచి జట్టే: ఫ్లెమింగ్**

''ఈ ఓటమిపై మాట్లాడటం కష్టంగా అనిపిస్తోంది. మా దగ్గరున్న అత్యుత్తమ క్రికెటర్లతో సరైన ప్రదర్శన చేసేందుకు ప్రయత్నించాం. మా స్టైల్ క్రికెట్ ఆడాం. ఆక్షన్లో మంచి జట్టును తయారుచేసుకోవడం కీలకం. ఈ విషయంలో మాకంటే ఇతర టీమ్లు కాస్త మెరుగ్గా ఉన్నాయి. టాప్ ఆర్డర్ నుంచి కింది వరుస వరకూ ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలి. కీలక ఆటగాళ్లకు గాయాలు, కొందరు ఫామ్లో లేకపోవడం కూడా ప్రభావం చూపించింది'' అని సీఎస్కే కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ వెల్లడించాడు.

**ఇక ట్రయల్ రన్లా..: రాయుడు**

''ప్రస్తుత సీజన్లో సీఎస్కే పరిస్థితి బాగోలేదు. అథమంలో అథమంగా మారింది. అయితే, ఇక నుంచి నేర్చుకొనేందుకు చక్కటి అవకాశం వచ్చినట్లే. ఎంఎస్ ధోనీ కూడా వచ్చే ఎడిషన్ కోసం జట్టును తయారుచేసే పనిలో పడతాడు. ఇప్పుడు డెవాల్ బ్రెవిస్, ఆయుష్ మాత్రే వంటి కుర్రాళ్లు వెలుగులోకి వచ్చారు. భవిష్యత్తు సీజన్లలో వారే కీలకంగా మారే అవకాశం లేకపోలేదు. వ్యక్తిత్వపరంగా మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. ఇప్పుడంతా ట్రయల్రన్లా సీఎస్కే జట్టును చూడొచ్చు'' అని అంబటిరాయుడు వ్యాఖ్యానించాడు.

## పాక్ తో క్రికెట్ సంబంధాలన్నింటినీ తెంచుకోవాలి: సౌరభ్ గంగూలీ



2008 తర్వాత పాకిస్థాన్ కు టీమ్ఇండియా వెళ్లని సంగతి తెలిసిందే. చివరిసారిగా 2012 - 13లో భారత్ వేదికగా ఇరు జట్ల మధ్య ద్వైపాక్షిక సిరీస్ జరిగింది. అప్పట్నుంచి కేవలం తటస్థ వేదికల్లోనే తలపడుతూ వస్తున్నాయి. ఇప్పుడు పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్ తో క్రికెట్ ఆడొద్దనే డిమాండ్లు వస్తున్నాయి. ఈ వ్యాఖ్యలకు భారత మాజీ క్రికెటర్ సౌరభ్ గంగూలీ మద్దతు తెలిపాడు. ఇక నుంచి పాక్ తో ఎలాంటి క్రికెట్ ఆడొద్దని బీసీసీఐకి విజ్ఞప్తి చేశాడు. ''వందశాతం అంగీకరిస్తా. పాకిస్థాన్ తో క్రికెట్ సంబంధాలను తెంచుకోవాలి. అది జరిగి తీరాలి. తప్పకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రతి సంవత్సరం ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉండటం తమాషా కాదు. ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించకూడదు'' అని గంగూలీ వ్యాఖ్యానించాడు.

**ఉగ్రదాడి పై స్పందించని పాక్ క్రికెటర్లు**

కశ్మీర్ లో జరిగిన ఉగ్రదాడిపై ప్రపంచవ్యాప్తంగా స్పందనలు వస్తుంటే.. డానిష్ కనేరియా మినహా పాకిస్థాన్ క్రికెటర్లు ఎవరూ స్పందించలేదు. గత ఛాంపియన్స్ ట్రోఫీ సందర్భంగా మాత్రం భారత్ పై అవాకులు చవాకులు పేలిన సంగతి తెలిసిందే. టోర్నీనే బహిష్కరించాలంటూ పెద్ద మాటలే చెప్పారు. ఇప్పుడు మాత్రం కనీసం ఖండిస్తూ ఒక్క ప్రకటన చేయలేదు. ఆ దేశ ప్రభుత్వంలా 'తమకేమీ సంబంధం' లేనట్లుగా వ్యవహరిస్తుండటం గమనార్హం.

### గతేడాది ఆర్సీబీ చేసింది..

## ఆ స్ఫూర్తితో ఈసారి మేం సాధిస్తాం: నితీశ్

ఐపీఎల్ 2025 సీజన్ లో చెపాక్ వేదికగా తొలిసారి సన్ రైజర్స్ హైదరాబాద్ అద్భుత విజయం సాధించింది. చెన్నై సూపర్ కింగ్స్ని ఐదు వికెట్ల తేడాతో మట్టికరిపించింది. దీంతో ప్లేఆఫ్స్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. తొమ్మిది మ్యాచుల్లో మూడు విజయాలనే నమోదు చేసిన సన్ రైజర్స్.. మిగతా ఐదు మ్యాచుల్లో అన్నీ గెలిస్తేనే నాకౌట్ కు చేరుతుంది. ఈ విషయంలో తమకు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టే స్ఫూర్తి అని ఎస్ఆర్హెచ్ ఆటగాడు నితీశ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించాడు. ''చెన్నైపై విజయం సాధించడం ఆనందంగా ఉంది. ఇకనుంచి మేం ఒక్కో మ్యాచ్ ఫలితం గురించి ఆలోచిస్తాం. ఇప్పుడు గెలిచాం. మిగిలిన వాటిల్లోనూ విజయం సాధించేందుకు ప్రయత్నిస్తాం. కమిందుతో కలిసి కీలక భాగస్వామ్యం నిర్మించడం బాగుంది. భారీ షాట్లకు పోకుండా తేలికగా మ్యాచ్ ను ముగించాలని మాట్లాడుకున్నాం. నూర్ అహ్మద్, ఖలీల్ అహ్మద్ బౌలింగ్ బాగా చేస్తున్నారు. చివరికి మేం విజయం సాధించాం. మాకు డూ ఆర్ డై లాంటి పోరు. గతేడాది ఇదే పరిస్థితుల్లో ఆర్సీబీ ఉంది. వరుసగా మ్యాచులు గెలిచి ప్లే ఆఫ్స్ కు చేరుకుంది. ఈ సంవత్సరం మేం ఎందుకు సాధించకూడదు? వందశాతం ప్రదర్శన ఇస్తే మిగతా మ్యాచుల్లో విజయం సాధించే అవకాశాలు మెరుగ్గా ఉంటాయి'' అని నితీశ్ వెల్లడించాడు.

## దేశమంతా విషాదంలో ఉంటే వెకేషన్కు వెళ్తావా అంటూ నెటిజన్ కామెంట్.. రష్మీ ఏమన్నారంటే



శస్త్ర చికిత్స అనంతరం ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు నటి రష్మీ. ఇందులో భాగంగా మానసిక ప్రశాంతత, తన పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకోవాలనే ఉద్దేశంతో ఆమె తాజాగా బాలి టూర్కు వెళ్లారు. వెకేషన్లో భాగంగా దిగిన కొన్ని ఫొటోలను ఇన్స్టా వేదికగా పంచుకున్నారు. దీనిపై ఓ నెటిజన్ స్పందిస్తూ.. ''పహల్గాం ఉగ్రదాడి వేళ దేశం మొత్తం విషాదంలో మునిగి ఉంటే నువ్వు మాత్రం వెకేషన్ కోసం వెళ్తావా'' అని ప్రశ్నించాడు. దీనిపై ఆమె తనదైన శైలిలో స్పందించారు.

నెటిజన్ కామెంట్ను స్క్రీన్ షాట్ తీసుకున్న ఆమె.. దానిని ఎక్స్ వేదికగా షేర్ చేశారు. '' ప్రస్తుతం నేను బాలిలో ఉన్నా. నా సంస్కృతి, సాంప్రదాయాలకు ఈ దేశం ఎంతో చేరువగా ఉంటుంది. అందుకే ఇక్కడికి వచ్చా. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే.. ఇది రెండు నెలల క్రితమే ప్లాన్ చేసిన ట్రిప్. పుట్టినరోజుకు ప్రతి ఏడాది ఏదో ఒక ప్రాంతానికి టూర్కు వెళ్లడం నాకు ఇష్టం. కాబట్టి రేపు నా పుట్టినరోజుకు విషెస్ చెప్పడం మర్చిపోవద్దు. అంతేకాకుండా నేను శస్త్రచికిత్స నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నా'' అని ఆమె చెప్పారు.

తీవ్రమైన భుజం నొప్పి, అకాల రక్తస్రావంతో తాను ఇబ్బందిపడినట్లు ఇటీవల రష్మీ తెలిపారు. వైద్యులను సంప్రదించానని.. ఈ నెల 18న శస్త్రచికిత్స జరిగిందని ఆమె తెలిపారు. ఆపరేషన్ ముందు దిగిన ఫొటోలను ఇన్స్టాలో పంచుకున్నారు. మరో మూడు వారాలు తాను విశ్రాంతిలోనే ఉంటానని.. ఆ తర్వాత వర్క్పైదృష్టి పెడతానని అన్నారు. ఈక్రమంలోనే ఆమె తాజాగా ఇన్స్టా వేదికగా బాలి టూర్ ఫొటోలు పంచుకున్నారు. ''ఎన్నో సాహసాలు, ప్రకృతి అందాలను ఆస్వాదించాలనే ఉద్దేశంతో రెండు నెలల క్రితం ఈ టూర్ ప్లాన్ చేశా. కానీ, ఇప్పుడు పరిస్థితులు మారాయి. నిద్రపోవడం, నచ్చిన ఫుడ్ తినడంతోనే ఈ టూర్ గడుస్తోంది. జీవితంలో కొత్త విషయాలను నేర్పించడానికి భగవంతుడు వింతైన మార్గాలు ఎంచుకుంటాడని అనిపిస్తోంది'' అని ఆమె రాసుకొచ్చారు.

## వారి విడాకులు.. ఆ సమయంలో జీవితపాఠం నేర్చుకున్నా: శ్రుతి హాసన్

కమల్హాసన్ కుమార్తెగా ఇండస్ట్రీకి పరిచయమై తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు నటి శ్రుతి హాసన్. సినీ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చినప్పటికీ తాను ఎప్పుడూ దాన్ని దృష్టిలో పెట్టుకోలేదని తాజాగా వెల్లడించారు. ఇండస్ట్రీకి రావడానికి ముందు ఎన్నో విషయాలు తెలుసుకున్నట్లు తెలిపారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రుతి తన చిన్ననాటి విషయాలు పంచుకున్నారు. తన తల్లిదండ్రులు విడాకులు తీసుకున్న సమయంలోనే తాను జీవిత పాఠం నేర్చుకున్నట్లు చెప్పారు. ''నేను ఇండస్ట్రీకి రావడానికి ముందు నా జీవితంలో ఏం జరిగిందో చాలామందికి తెలియదు. నా తల్లిదండ్రులు విడిపోవడం నన్ను ఎంతో బాధించింది. వారిద్దరూ విడిపోయాక నేను అమ్మతో ఉన్నాను. అప్పటివరకు ఉన్న జీవితం ఒక్కసారిగా మారిపోయింది. చెన్నై నుంచి ముంబయి వచ్చేశాం. విలాసవంతమైన జీవితం దూరమైంది. అప్పటివరకూ మెర్సిడెస్ బెంజ్ కారులో తిరిగిన నేను లోకల్ ట్రైన్లో ప్రయాణించాను. రెండు రకాల జీవితాలు చూశాను. ఇండస్ట్రీకి వచ్చాక నాన్నతో ఎక్కువగా ఉంటున్నాను. విదేశాల్లో సంగీతం నేర్చుకున్నాను. నాకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాను. స్వతంత్రంగా, ఆత్మవిశ్వాసంతో జీవిస్తున్నాను'' అని చెప్పారు. శ్రుతిహాసన్ తల్లిదండ్రులు కమల్ హాసన్, సారిక 2004లో విడిపోయిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం శ్రుతి 'కూలీ' సినిమాలో నటిస్తున్నారు. రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ దీన్ని రూపొందిస్తున్నారు. నాగార్జున, ఉపేంద్ర తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. బంగారం స్మగ్లింగ్ అంశంతో ముడిపడి ఉన్న యాక్షన్ కథాంశంతో ఇది ముస్తాబవుతోంది. ఆగస్టు 14న ఇది ప్రేక్షకుల ముందుకురానుంది.



## NC24 ప్రీ-ప్రొడక్షన్ వీడియో.. మామూలుగా లేదుగా!




అక్కినేని నాగచైతన్య ప్రస్తుతం తన నెక్స్ట్ ప్రాజెక్ట్ను దర్శకుడు కార్తీక్ దండు డైరెక్షన్లో తెరకెక్కించేందుకు సిద్ధమయ్యాడు. ఈ సినిమాను గతంలోనే అనౌన్స్ చేసిన సంగతి తెలిసిందే. ఇక తాజాగా ఈ సినిమా నుంచి ఓ ఇంట్రెస్టింగ్ అప్డేట్ అయితే మేకర్స్ ఇచ్చారు.ఈ సినిమాకు సంబంధించిన రీసెర్చ్, దాని కోసం వారు పడ్డ కష్టం, ఇక సినిమా కోసం వారు రెడీ అవుతున్న తీరు ను ప్రెజెంట్ చేస్తూ ఓ ప్రీ-ప్రొడక్షన్ వీడియోను మేకర్స్ తాజాగా రిలీజ్ చేశారు. మిస్టిక్ థ్రిల్లర్గా రానున్న ఈ సినిమా కోసం అందరూ సిద్ధమయ్యారని ఈ వీడియో ద్వారా తెలిపారు. ఇక ఈ సినిమా కోసం భారీ బడ్జెట్ను కేటాయించారు. ఈ సినిమాలో చైతూ సరికొత్త లుక్తో అడ్వెంచర్ చేయబోతున్నాడని చిత్ర యూనిట్ తెలిపింది. ఈ సినిమాను శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ రైటింగ్స్ ప్రొడ్యూస్ చేస్తున్నాయి.



## మహేష్ కంటే రాజమౌళి డబుల్..?

ప్రస్తుతం టాలీవుడ్ లో తెరకెక్కుతున్న ప్రెస్టీజియస్ చిత్రాల్లో దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి డైరెక్షన్ లో సూపర్ స్టార్ మహేష్ బాబు నటిస్తున్న ఖిఖిఆ29 కూడా ఒకటి. ఈ సినిమాను రాజమౌళి నెక్స్ట్ లెవెల్ లో చిత్రీకరిస్తున్నాడు. ఇక ఇప్పటికే ఈ సినిమాపై ప్రపంచవ్యాప్తంగా ఎలాంటి హైప్ క్రియేట్ అయ్యిందో అందరికీ తెలిసిందే. ఈ సినిమా కోసం నిర్మాత ఏకంగా రూ.1000 కోట్ల బడ్జెట్ ను కేటాయించారట. అయితే, ఈ సినిమా కోసం రాజమౌళి తీసుకునే రెమ్యునరేషన్ ప్రస్తుతం హాట్ టాపిక్గా మారింది. ఈ సినిమా కోసం ఆయన ఏకంగా రూ.200 కోట్ల మేర రెమ్యునరేషన్ తీసుకుంటున్నాడని.. ఇది మహేష్ బాబు రెమ్యూనరేషన్ కంటే రెట్టింపు అని తెలుస్తోంది. ఇక ఈ సినిమా నెక్స్ట్ షెడ్యూల్ ను ఆఫ్రికాలో షూటింగ్ చేయనున్నారు మేకర్స్. ఈ సినిమాలో మహేష్ బాబు చేసే అడ్వెంచర్ ప్రేక్షకులను కట్టిపడేయడం ఖాయమని చిత్ర యూనిట్ చెబుతోంది. ఈ సినిమాలో ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు.

## శర్వానంద్ సినిమాలో అనుపమ ఎంట్రీ

ఛార్మింగ్ స్టార్ శర్వానంద్ ప్రస్తుతం వరుసగా సినిమాలు చేస్తూ బిజీగా ఉన్నాడు. ఇక ఆయన కెరీర్లో 38వ చిత్రాన్ని దర్శకుడు సంపత్ నంది డైరెక్ట్ చేస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమాపై సినీ సర్కిల్స్తో పాటు ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ అయ్యింది. అయితే, ఈ సినిమాను పూర్తి యాక్షన్ ఎంటర్ టైనర్ గా మేకర్స్ రూపొందిస్తున్నారు.

ఇక ఈ సినిమా నుంచి మేకర్స్ తాజాగా ఓ సాలిడ్ అప్డేట్ రివీల్ చేశారు. ఈ




సినిమాలో అందాల భామ అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్ గా నటిస్తున్నట్లు వారు అనౌన్స్ చేశారు. ఆమెకు సంబంధించి ఓ ప్రీ-లుక్ పోస్టర్ కూడా వారు రిలీజ్ చేశారు. దీంతో ఈ సినిమాలో ఆమె పాత్ర ఎలా ఉండబోతుందా అనే ఆసక్తి అందరిలో నెలకొంది. ఈ సినిమాకు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నాడు. ఈ సినిమాను ప్రముఖ నిర్మాత కె.కె.రాధామోహన్ శ్రీ సత్యసాయి ఆరట్స్ బ్యానర్ పై ప్రొడ్యూస్ చేస్తున్నారు.



## రామ్ సినిమాలో కన్నడ హీరో..

యంగ్ అండ్ ఎనర్జిటిక్ హీరో రామ్ పోతినేని నటిస్తున్న లేటెస్ట్ చిత్రాన్ని పి.మహేష్ బాబు డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ సినిమాలో అందాల భామ భాగ్యశ్రీ బొర్సె హీరోయిన్గా నటిస్తోంది. ఇక ఈ సినిమా పూర్తి రొమాంటిక్ ఎంటర్టైనర్గా చిత్ర యూనిట్ రూపొందిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఓ ఇంట్రెస్టింగ్ వార్త సినీ సర్కిల్స్లో చక్కర్లు కొడుతోంది. ఈ సినిమాలో ఓ కీలక పాత్ర ఉండనుందట. ఆ పాత్ర కోసం ఎవరైనా సీనియర్ హీరోను తీసుకోవాలని మేకర్స్ భావిస్తున్నారట. తొలుత ఈ పాత్రకు మోహన్ లాల్ని తీసుకోవాలని చిత్ర యూనిట్ భావించిందట. కానీ, కొన్ని కారణాల వల్ల ఇప్పుడు కన్నడ హీరో ఉపేంద్రతో చిత్ర యూనిట్ చర్చలు జరుపుతుందట. ఇప్పటికే ఉపేంద్రకు కథను కూడా నెరేట్ చేశారట చిత్ర యూనిట్. మరి ఈ సినిమాలో నటించేందుకు ఆయన ఒప్పుకుంటారా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. ఈ సినిమాను మైత్రి మూవీ మేకర్స్ ప్రొడ్యూస్ చేస్తున్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.